శుక్రవారం
09-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 49
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సునీతా విలియమ్స్ రాక మరింత జాప్యం

వాషింగ్టన్: మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సాంకేతిక కారణాలతో రోజుల తరబడి అక్కడే చిక్కుకుపోయారు. ఆమె రాక మరింత ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. మరో ఎనిమిది నెలల పాటు అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నాసా తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. 8 రోజుల మిషన్‌లో భాగంగా సునీత, విల్‌మోర్ జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. వాస్తవానికి జూన్ 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సి ఉండగా... వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి.

హాకీ జట్టు అదరహో

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు హాకీ జట్టు కాంస్య పతకం అందించింది. కాంస్య పతకం కోసం సాగిన పోరులో భారత హాకీ జట్టు స్పెయిన్‌పై 2-1 గోల్స్ తేడాతో గెలుపొందడం ద్వారా పతకాన్ని తన ఖాతాల్లో వేసుకుంది. దీంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటివరకు షూటింగ్‌లో 3 కాంస్య పతకాలు రాగా... తాజాగా హాకీ జట్టు మరో పతకం సాధించింది. సెమీఫైనల్స్‌లో తుది వరకు పోరాడి 2-3 తేడాతో జర్మనీపై ఓడిపోయిన భారత్ గురువారం కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో స్పెయిన్‌పై విజయం సాధించింది. రెండో సెట్ ప్రారంభంలో మొదటి గోల్ సాధించి స్పెయిన్1-0 అధిక్యంలోకి వెళ్లింది. రెండో సెట్ ఆఖరి నిమిషంలో భారత్ మొదటి గోల్ చేసి స్కోర్‌ను 1-1తో సమం చేసింది. ఇక మూడో సెట్ ప్రారంభంలో ఆట 33వ నిమిషంలో మరో గోల్ చేయడంతో భారత్ 2-0 అధిక్యంలోకి వెళ్లింది. సింగ్ హరమన్‌ప్రీత్ భారత్ తరపున రెండు గోల్స్ చేశారు. మూడో సెట్ ముగిసే సమయానికి భారత్ 2-1 అధిక్యంలో నిలిచింది. నాల్గవ సెట్‌లో ఎవరికి పాయింట్ రాకపోవడంతో భారత్ 2-1తో విజయం సాధించి కాంస్య పతకం అందుకుంది.

భారత్ ఖాతాలో మరో కాంస్యం

హాకీలో 13వ పతకం...

ఇప్పటివరకు భారత్ హాకీలో 13 పతకాలు సాధించింది. ఇందులో స్వాతంత్ర్యానికి ముందు 3 పతకాలు గెలవగా.. ఆ తర్వాత 10 పతకాలను గెలుచుకుంది. గత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్న భారత జట్టు పారిస్ ఒలింపిక్స్‌లోనూ కాంస్య పతకం సాధించింది. 1928లో బంగారు పతకం గెలుచుకున్న భారత్... ఆ తర్వాత 1932, 1936 ఒలింపిక్స్‌లో వరుసగా మూడు బంగారు పతకాలు సాధించింది. స్వాతంత్ర్యం

- మిగతా 2 లో

రాజ్యసభకు వినేశ్ ఫొగాట్?

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్ పతకం సాధిస్తుందని గంపెడాశతో ఎదురుచూసిన భారతీయులకు 'అనర్హత' రూపంలో దిమ్మతిరిగింది. ఈ క్లిష్ట సమయంలో ఆమెకు దేశమంతా అండగా నిలిచింది. హర్యానా మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత భూపిందర్ సింగ్ హుడా ఒక అడుగు ముందుకు వేసి, ఆమెను రాజ్యసభకు నామినేట్ చేయాలన్నారు. ఆయన కుమారుడు దీపిందర్ సింగ్ హుడా కూడా ఇదే తరహాలో స్పందించారు. 'ఫైనల్‌కు చేరిన వినేశ్ ఆట నుంచి వైదొలగాల్సి వచ్చినప్పటికీ... కోట్లాది మంది ప్రజల హృదయాలు గెల్చుకున్నారు. క్రీడా వ్యవస్థ ఓడిపోయింది. బంగారు పతక విజేతలకు ఇచ్చే సౌకర్యాలనే ఆమెకు కల్పించాలి. ధైర్యం, స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ఆమే ఈ పదవికి తగిన వ్యక్తి' అని

- మిగతా 2 లో

బంగ్లాలో వీసా కేంద్రాల మూసివేత

ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేయాలంటూ దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దాంతో బంగ్లాదేశ్‌లో అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని భారతీయ వీసా కేంద్రాలన్నింటినీ నిరవధికంగా అధికారులు మూసి వేశారు. మళ్లీ ఈ కేంద్రాలు ఎప్పుడు తెరిచేది ముందుగానే వెల్లడిస్తామన్నారు. సోమవారం షేక్ హసీనా ప్రభుత్వం

- మిగతా 2 లో

రేపు వయనాడ్‌కు మోదీ

న్యూఢిల్లీ: ప్రకృతి సృష్టించిన బీభత్సంతో కేరళలోని వయనాడ్ జిల్లాలో చూరల్మల, ముండక్క గ్రామాలు దారుణంగా దెబ్బతి న్నాయి. దీంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్ట్ 10వ తేదీన... ఆయా గ్రామాల్లో పర్యటించను న్నారు. నిరాశ్రయులు తలదా చుకున్న పునరావాస కేంద్రా లను సైతం ఆయన సందర్శిం చనున్నారు. అయితే, మోదీ ఏరియల్ సర్వేకే పరిమితమవు తారని తెలుస్తోంది. వయనా డ్‌లో చోటుచేసుకున్న ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని మోదీకి

- మిగతా 2 లో

యూనస్ ప్రమాణ స్వీకారం

తాత్కాలిక ప్రభుత్వ సారథిగా...

ఢాకా: బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. ప్రభుత్వ సారథిగా నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మహమ్మద్ యూనస్ (84) ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష కార్యాలయం 'బంగభబన్'లో నిర్వహించిన కార్యక్రమంలో యూనస్‌తో దేశాధ్యక్షుడు మొహమ్మద్ షహబుద్దీన్ ప్రమాణం చేయించారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మ కంగా మారడంతో ప్రధానిగా ఉన్న

- మిగతా 2 లో

బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ కన్నుమూత

2లో

పార్లమెంట్‌లో 'వక్ఫ్' మంటలు

- సవరణ బిల్లుపై భగ్గుమన్న 'ఇండియా' ఎంపీలు
- మతస్వేచ్ఛ, సమాఖ్య వ్యవస్థ, రాజ్యాంగంపై దాడిగా అభివర్ణన
- వెనక్కి తగ్గిన మోదీసర్కారు...జేపీసీకి పంపేందుకు అంగీకారం

న్యూఢిల్లీ: విపక్ష ఇండియా ఐక్యసంఘటన తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై మోదీ సర్కారు యూటర్న్ తీసుకుంది. వక్ఫ్ సవరణ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపింది. వక్ఫ్ చట్టంలో మార్పులు తీసుకువస్తూ మోదీ సర్కారు రూపొందించిన సవరణ బిల్లు గురువారం

- మిగతా 2 లో

త్వరలో జన్మభూమి-2

- తొలిదశలో ముఖ్యనేతలకు నామినేటెడ్ పదవులు
- టీడీపీ పొలిట్‌బ్యూరో కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన జన్మభూమి కార్యక్రమాన్ని మరలా అమలు చేయాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం నిర్ణయించింది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'జన్మభూమి-2' పేరుతో త్వరలోనే మరలా ప్రారంభించాలని నిర్ణయించారు. నైపుణ్య గణనను దేశంలోనే తొలిసారిగా ఏపీలో చేపట్టాలనే అభిప్రాయానికి వచ్చారు. త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించాలని, తెలంగాణలో కూడా పార్టీ బలోపేతానికి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. పేదరిక నిర్మూలనపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని నిర్ణయించారు. పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ముఖ్యనేతలకు మొదటి దశలో నామినేటెడ్ పదవుల భర్తీ చేపట్టాలనే అభిప్రాయానికి నేతలు వచ్చారు. రెండున్నర గంటలపాటు వివిధ అంశాలపై చంద్రబాబు పార్టీ నేతలకు మార్గనిర్దేశనం చేశారు. అనంతరం సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను మంత్రి అచ్చెన్నాయుడు మీడియాకు వివరించారు. దక్షిణ భారతదేశంలో జనాభా నిష్పత్తి తగ్గుతుంది. దీంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం తగ్గుతాయని, అందువల్ల సంతాన ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. జనాభా నియంత్రణతో డీలిమిటేషన్‌లో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతోంది. యూపీలో 140 పార్లమెంటు స్థానాలు వస్తే దక్షిణ భారతదేశంలో మొత్తం 160 మాత్రమే ఉంటాయి. దీనిలో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కూడా సంతాన పరిమితిని ఎత్తివేస్తూ త్వరలో అసెంబ్లీలో బిల్లు పెట్టనున్నట్లు చెప్పారు. త్వరలో పేదరిక నిర్మూలనపై విధివిధానాలు రూపొందించాలని, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని దీనిలో భాగస్వాములుగా చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని నిశ్చయించినట్లు చెప్పారు. విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరనే దానిపై కూడా మంత్రులు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు చర్చించినట్లు తెలిపారు. నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, కాలువ శ్రీనివాసులు, బొండా ఉమామహేశ్వర రావు హాజరయ్యారు.

కుళ్లిన గుడ్లు... చిన్నారులకు చేటు!

- కాంట్రాక్టర్ ధనదాహం...
- కమీషన్లు మింగుతున్న అధికారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- విచారణ జరపాలని కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-అరకులోయ (అల్లూరి జిల్లా): అధికారుల అండతో కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తూ చిన్నారులను అనారోగ్యం పాల్జేస్తున్న కాంట్రాక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ విద్యా కమిటీ చైర్మన్, పీఏసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికా రులను డిమాండ్ చేస్తున్నారు. కమీషన్లకు అలవాటుపడిన కిందిస్థాయి అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో టెండరుదారు ధనదాహానికి అడ్డూఅదుపూ లేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు. అసలే మారుమూల ప్రాంతం... ఆపై అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు కావడంతో

- మిగతా 2 లో

ప్రైవేటు పల్లవి!

- పీపీపీ విధానంపై కూటమి దృష్టి
- కొత్త వైద్య కళాశాలలపై కసరత్తు
- విమానాశ్రయాలపైనా ఆలోచన
- రాష్ట్ర రహదారులపై టోల్ చార్జి?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని కొత్త వైద్యకళాశాలలు, విమానాశ్రయాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న దిశగా కూటమి అడుగులు వేస్తున్నట్లు ప్రచారం జోరందుకుంది. రాష్ట్ర రహదారులపై టోల్ ఫ్రీ విధించాలన్న ఆలోచనకూ తెరతీసినట్లు తెలిసింది. కొన్ని అంశాల్లో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానాలపై అధ్యయానికి సిద్ధమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేస్తే ప్రజాగ్రహం తప్పదని విపక్షాలు హెచ్చరిస్తున్నాయి. మొదటగా... కొత్తగా వచ్చిన వైద్యకళాశాలలను పీపీపీ విధానం అమలు చేసేందుకు ఇటీవల మంత్రి మండలిలో ప్రతిపాదించారు. ఇందుకోసం గుజరాత్ రాష్ట్రంలోని పీపీపీ విధానాన్ని అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు సూచించడం చర్చనీయాంశమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త వైద్యకళాశాలలకు అంకురార్పణ జరిగింది. జాతీయ వైద్య కమిషన్ అనుమతితో మొదటి విడత విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలోకొత్త వైద్యకళాశాలలను నిర్మించారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఈ ఐదు వైద్యకళాశాలల్లో 107, 108 జీవోలు జారీజేసి మొత్తం 50 శాతం సీట్లను విక్రయించారు. రెండో విడతగా...పులివెందుల, మార్కాపురం, మదనపల్లె, పాడేరు, ఆదోనిలో మరో ఐదు కొత్త వైద్యకళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. వాటికీ అదే పద్ధతి వర్తిస్తుంది. ఒక వైపు ఆయా జీవోలు రద్దుచేయాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. పైపెచ్చు మంత్రి మండలిలో కొత్తగా నిర్మించిన వైద్య కళాశాలల కార్యకలాపాలు పీపీపీ విధానానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇదే అమలైతే పేద విద్యార్థులకు వైద్య విద్య పూర్తిగా దూరమైపోతుంది. పేరుకు ఇవి ప్రభుత్వ వైద్య కళాశాలలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

జల కళ... జన కళ

- శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని గేట్లు ఎత్తివేత
- ప్రాజెక్టుల వద్ద సెల్ఫీల కోలాహలం
- సముద్రంలోకి 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎగువ ప్రాంతాల్లోని వర్షాలతో కృష్ణానదిపై ఉన్న జలశయాలన్నీ నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. దీంతో శ్రైశైలం నుంచి దిగువన ఉన్న నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో జన సందడి నెలకొంది. ప్రజలు పెద్దసంఖ్యలో ప్రాజెక్టుల వద్దకు తరలివస్తున్నారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేతతో ఎగసిపడుతున్న జలధారలు, తుంపరలను ఆస్వాదిస్తూ తడిసి ముద్దవుతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కలిసి

- మిగతా 2 లో

జపాన్‌లో భారీ భూకంపం

సునామీ హెచ్చరిక జారీ

జపాన్‌ను భారీ భూకంపం వణికించింది. గురువారం దక్షిణ తీర ప్రాంతంలో క్యుషు ద్వీపం సమీపంలో ఇది సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 7.1గా నమోదైందని జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. 30 కి.మీ. లోతులో భూకంప కేంద్రం నమోదైందని తెలిపింది.

2 లో

జపాన్‌లో భారీ భూకంపం

సునామీ హెచ్చరిక జారీ

టోక్యో: జపాన్‌ను భారీ భూకంపం వణికించింది. గురువారం దక్షిణ తీర ప్రాంతంలో క్యుషు ద్వీపం సమీపంలో ఇది సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 7.1గా నమోదైందని జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. 30 కి.మీ. లోతులో భూకంప కేంద్రం నమోదైందని తెలిపింది. దాంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. భూకంప కేంద్రం సమీపంలోని విమానాశ్రయం అద్దాలు దెబ్బతిన్నాయని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. క్యుషు ద్వీపంలోని నిచినాన్, మియాజాకి సమీపంలోని కొన్ని ప్రాంతాలపై భూకంపం ప్రభావం ఎక్కువగా కనిపించింది. 1.6 అడుగుల ఎత్తులో అలలు కనిపించినట్లు జపాన్ వాతావరణ శాఖ వెల్లడించింది. అధికారులు నష్ట తీవ్రతను అంచనా వేస్తున్నట్లు చీఫ్ క్యాబినెట్ సెక్రటరీ వెల్లడించారు. ప్రభావిత ప్రాంత ప్రజలు తీరానికి దూరంగా ఉండాలని సూచించారు. క్యుషు, షికోకు ప్రాంతంలోని న్యూక్లియర్ రియాక్టర్లు సురక్షితంగానే ఉన్నాయని అణు నియంత్రణ సంస్థ వెల్లడించింది. 2011లో సంభవించిన భూకంపం, సునామితో పుకుషిమా అణుకేంద్రం దెబ్బతింది. అప్పటి నుంచి ప్రకృతి ప్రకోపించినప్పుడల్లా ఈ అణు రియాక్టర్ల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా, జపాన్‌లో ఏటా సగటున 5 వేల చిన్నాపెద్దా భూకంపాలు వస్తుంటాయి. అక్కడి ప్రజలు వీటిని ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. జపాన్ ట్రెంచ్‌గా పిలుస్తున్న జపనీస్ అగాధం కూడా భూకంపాలు రావడానికి మరో కారణం. పసిఫిక్ వాయువ్య ప్రాంతంలోని ఈ సముద్ర అగాధం 800 మీటర్ల లోతులో ఉంటుంది. అందులో కదలికలు ఏర్పడినప్పుడు భూకంపాలు, సునామీలు వస్తుంటాయి. ఇదిలా ఉంటే... భూకంపంతోపాటు సునామీ వస్తే టోక్యో నగరంలోకి భారీగా నీరు వస్తుంది. ఆ నీటిని మళ్లించేందుకు నగర శివారులో పెద్ద సొరంగం ఏర్పాటు చేశారు. తుపానులు, వరదల కారణంగా వచ్చిన నీరు మొత్తం ఈ సొరంగం ద్వారా ఎడో నదిలోకి మళ్లిస్తారు. ఈ ఏడాది మొదటి రోజే జపాన్‌లో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. దానిలో 200 మందిపైగా ప్రాణాలు కోల్పోయారు.

ట్రంప్ ఓడిపోతే హింస తప్పదేమో!

బైడెన్ అనుమానం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విషయంలో అధ్యక్షుడు జో బైడెన్ ఆందోళన వ్యక్తంచేశారు. నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోతే... కమలాహారిస్‌కు శాంతియుతంగా అధికారాన్ని దక్కనిస్తారన్న విశ్వాసం తనకు లేదని వ్యాఖ్యానించారు. ఒక అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ సందేహం వ్యక్తంచేశారు. 2025 జనవరిలో అధికార మార్పిడి శాంతియుతంగా ఉంటుందా అని అడిగిన ప్రశ్నకు బైడెన్ సమాధానమిస్తూ.. 'ట్రంప్ ఓడిపోతే, నాకు ఆ విశ్వాసం లేదు' అని అన్నారు. 2021లో జనవరి 6న ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్ హిల్‌పై దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. జో బైడెన్ గెలుపును ధ్రువీకరించేందుకు కాంగ్రెస్ ఉభయ సభలు సమావేశమవగా... వేలాది మంది ట్రంప్ మద్దతుదారులు ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు యత్నించారు. బారికేడ్లు దాటుకొని... గోడలు ఎక్కుతూ భవనం లోపలికి దూసుకొచ్చారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు కాల్పులు జరపగా కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు కొన్నిగంటల ముందు నాటి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ప్రసంగం చేశారు. బైడెన్ తన ఓట్లు దొంగిలించి ఎన్నికల్లో గెలిచారని ఆరోపించారు. ఆ తర్వాతే తీవ్ర ఘర్షణలు జరగడం గమనార్హం. గత పరిణామాల నేపథ్యంలోనే బైడెన్ నుంచి స్పందన వచ్చింది. దీనికి సంబంధించిన ఇంటర్వ్యూ ఆదివారం పూర్తిగా ప్రసారం కానుంది. కాగా, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వ రేసులో ఉన్న అమెరికా ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ మిచిగాన్‌లోని రోమోలస్‌లో నిర్వహించిన ర్యాలీలో పలస్తీనా మద్దతుదారులు నిరసన గళం వినిపించారు. 'కమలా, కమలా.. మేం ఊచకోతకు ఓటేయం' అని నిరసించారు. 'ప్రజస్వామ్యంపై నాకు నమ్మకం ఉంది. అందుకే నేనిలా మీ ముందు ఉన్నాను. ప్రతిఒక్కరి గొంతునూ వినిపించాల్సిందే. అయితే ప్రస్తుతం నేను మాట్లాడుతున్నాను' అంటూ వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. అదే పనిగా నినాదాలు చేయడంతో ఆమె అసహనానికి గురయ్యారు. 'ట్రంప్ గెలుపును కోరుకుంటే అదే చెప్పండి... లేదా నేను మాట్లాడతాను' అని స్పష్టం చేశారు. అధ్యక్ష రేసు నుంచి జో బైడెన్ వైదొలగడంతో హారిస్ బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. ఆమెకు పార్టీ నుంచి అనూహ్య మద్దతు దక్కుతోంది. బరాక్ ఒబామా కూడా తన సహకారం ఉంటుందని తెలిపారు.

యూనస్ ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

షేక్ హసీనా రాజీనామా చేసిన విషయం విదితమే. దీంతో దేశాధ్యక్షుడు పార్లమెంటును రద్దు చేశారు. తాత్కాలిక పరిపాలన యంత్రాంగానికి యూనస్‌ను సారథిగా నియమిస్తున్నట్లు మంగళవారం అర్ధరాత్రి సమయంలో ప్రకటన వెలువరించారు. ఈరోజు ఉదయం ఫ్రాన్స్ నుంచి ఢాకా చేరుకున్న యూనస్... ప్రభుత్వ సారథిగా ప్రమాణ స్వీకారం చేశారు. చిట్టగాంగ్‌లో 1940లో జన్మించిన యూనస్... ఓ సామాజిక కార్యకర్త, బ్యాంకర్, ఆర్థికవేత్త. 2012 నుంచి 2018 వరకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గో కాలెడోనియన్ విశ్వవిద్యాలయానికి కులపతిగా ఉన్నారు.

చిట్టగాంగ్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర ఆచార్యుడిగా సేవలందించి, బంగ్లాదేశ్‌లోని పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారు. మైక్రోఫైనాన్స్ బ్యాంక్ ద్వారా లక్షల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేసిన ఘనత సాధించారు. అందుకు 2006లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందారు. హసీనా సర్కారుతో ఘర్షణపడినందుకు ఆయనపై పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో ఆరు నెలల జైలుశిక్ష పడింది. బంగ్లాకు రెండోసారి విముక్తి లభించిందని ఆయన వ్యాఖ్యానించారు.

రాజ్యసభకు వినేశ్ ఫొగాట్?

(మొదటిపేజీ తరువాయి)

దీపిందర్ హుడా అన్నారు. దీనిపై వినేశ్ పెదనాన్న మహవీర్ ఫొగాట్ స్పందించారు. 'మరి భూపిందర్ సింగ్ హుడా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గీతా ఫొగాట్ (మహవీర్ కుమార్తె)ను ఎందుకు రాజ్యసభకు పంపలేదు' అని ప్రశ్నించారు. ఒలింపిక్స్ ఫైనల్‌లో అనర్హతకు గురైన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేసింది. 'తల్లిలాంటి కుస్తీ నా మీద గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించండి. మీ కల, నా ధైర్యం విచ్ఛిన్నమయ్యాయి. ఇక పోరాడే బలం లేదు. మీ అందరికి ఎప్పటికీ రుణపడి ఉంటా' అని పేర్కొంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరిన వినేశ్... అనూహ్య రీతిలో అదనపు బరువుతో అనర్హతకు గురికావడం ఆమెపై తీవ్ర ప్రభావం చూపింది. ఇదిలా ఉంటే... రాజ్యసభలో ఖాళీ అయిన 12 స్థానాలకు సోమవారం ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21 తుది గడువు. సెప్టెంబర్ 3న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

హాకీ జట్టు అదరహో

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత 1948 ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన భారత పురుషుల హాకీ జట్టు ఆ తర్వాత 1952, 1956 విశ్వ క్రీడల్లో బంగారు పతకం సాధించింది. స్వాతంత్ర్యం తర్వాత వరుసగా మూడు స్వర్ణపతకాలను సాధించింది. మళ్లీ 1960లో రజత పతకం సాధించగా.. 1964లో బంగారు పతకం సాధించింది. 1968, 1972 ఒలింపిక్స్‌లో భారత హాకీజట్టు కాంస్య పతకం సాధించింది. 1980 విశ్వక్రీడల్లో మరోసారి స్వర్ణ పతకం సాధించింది. 1980 నుంచి 2020 వరకు భారత హాకీ జట్టు పతకాన్ని సాధించలేదు. చివరిగా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెలవగా.. తాజాగా పారిస్ ఒలింపిక్స్‌లోనూ కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

రేపు వయనాడ్‌కు మోదీ

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు కేరళ, కర్నాటక, మహారాష్ట్ర ఎంపీలు డిమాండ్ చేయడంతో మోదీ వయనాడ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన అనంతరం జాతీయ విపత్తుగా ప్రధాని పకటించే అవకాశముందనే చర్చ ఊపందుకుంది. కాగా, వయనాడ్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగి పడడంతో మృతుల సంఖ్య 417కు చేరింది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీతోపాటు ప్రియాంక గాంధీ ఇటీవల వయనాడ్ జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే.

బంగ్లాలో వీసా కేంద్రాల మూసివేత

(మొదటిపేజీ తరువాయి)

కుప్పకూలిన అనంతరం ఢాకాలోని భారత రాయబారి కార్యాలయంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 190 మంది అవసరం లేని సిబ్బంది... తమ కుటుంబాలతో భారత్‌కు వెళ్లారని తెలిపారు. దేశంలో వివిధ దేశాలకు చెందిన దౌత్య కార్యాలయాలు మాత్రం విధులు నిర్వహిస్తున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి.

బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ కన్నుమూత

కోల్‌కతా: కమ్యూనిస్టు దిగ్గజ నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య (80) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన గురువారం ఉదయం కోల్‌కతాలోని తన నివాసంలో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈమేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం వెల్లడించారు. భట్టాచార్య 2000-2011 వరకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయనకు భార్య మీరా, కుమారుడు సుచేతన్ ఉన్నారు. పెద్దాయన ఇకలేరన్న వార్తతో కుటుంబ సభ్యులు, అభిమానులు, సీపీఎం కార్యకర్తలు, నేతలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. బుద్ధదేవ్ సీపీఎంలో నిర్ణయాధికార విభాగం పొలిట్‌బ్యూరోలో కీలకంగా వ్యవహరించారు. కమ్యూనిస్టు యోధుడు జ్యోతిబసు తర్వాత 2000 సంవత్సరంలో బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2011లో జరిగిన ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది. దీంతో క్రమంగా భట్టాచార్య ప్రజాజీవితం నుంచి దూరమయ్యారు. కొన్ని సంవత్సరాలుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. బుద్ధదేవ్ కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజ్ పూర్వ విద్యార్థి. ఆయన పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి అడుగుపెట్టేముందు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1977లో తొలిసారి కాశిపుర్-బెల్గాచియా నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంచలంచెలుగా తన వృత్తి జీవితంలో ఎదిగిన బుద్ధదేవ్.. జ్యోతి బసు ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2001, 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఆయన అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు. బాలీగంజ్‌లోని చిన్న ఇంట్లోనే నివసించేవారు. సీఎంగానూ అక్కడి నుంచే విధులు నిర్వర్తించారు. ఇప్పుడు అక్కడే తుదిశ్వాస విడిచారు. భట్టాచార్య 1944, మార్చి 1న భట్టాచార్య ఉత్తర కోల్‌కతాలో జన్మించారు. 1966లో సీపీఎం ప్రాథమిక సభ్యుడయ్యాడు. 1968లో పశ్చిమ బెంగాల్ డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 1971లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, 1982లో సెక్రటేరియట్ సభ్యుడిగా.. 1984 నుంచి పార్టీ కేంద్ర కమిటీకి నిత్య అతిథిగా ఉన్నారు. 1985లో కేంద్ర కమిటీ సభ్యుడిగా.. 2000 నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. 1977లో కోసిపూర్ నుంచి తొలిసారిగా శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1987లో ఓడిపోయినా అదే ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యారు. 1987-96 మధ్య కమ్యూనికేషన్స్ అండ్ కల్చర్ డిపార్ట్‌మెంట్‌ను మరియు 1996-99 వరకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖను నిర్వహించాడు. జూలై 2000లో ఉపముఖ్యమంత్రి అయ్యారు. అదే సంవత్సరం నవంబర్‌లో జ్యోతిబసు అనారోగ్య కారణాలతో పదవీ విరమణ చేయడంతో ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. పశ్చిమ బెంగాల్ పారిశ్రామికీకరణపై ఆయన గట్టి వైఖరిని తీసుకున్నారు.

సీపీఎం కేంద్ర కమిటీ సంతాపం

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల సీపీఎం కేంద్ర కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటనను విడుదల చేసింది. 'అత్యుత్తమ కమ్యూనిస్టు నాయకుడు, మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ఈ ఉదయం 8.20 గంటలకు మరణించారని మేము తీవ్ర విచారంతో తెలియజేస్తున్నాము. ఆయనకు నివాళిగా ఎర్ర జెండాను అవనతం చేయనున్నాము' అని పేర్కొంది. బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపం వ్యక్తం చేశారు. బుద్ధదేవ్ భట్టాచార్య మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, ఆదర్శాలు , అతని ముందుచూపు ఎల్లప్పుడూ తమకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.

సీపీఐ జాతీయ సమితి సంతాపం

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య దేశంలోని సీపీఎం, వామపక్షాలకు చెందిన అత్యంత సీనియర్ నాయకులలో ఒకరు. ప్రజాజీవితంలో సుదీర్ఘ కాలం కొనసాగిన ఆయన... తన సేవలతో ప్రజల మన్ననలు పొందారు. చురుకైన, నిబద్ధత, అంకితభావంతో కూడిన కమ్యూనిస్టు రాజకీయవేత్త అయిన కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య... రచయితగా తన పద్యాలు, గద్యాలు, అనువాదాలతో బెంగాల్ సాహిత్యం, సంస్కృతి చరిత్రలను సుసంపన్నం చేశారు. ప్రఖ్యాత మేధావిగానూ గౌరవించబడ్డారు. బెంగాల్ సాహిత్య, సాంస్కృతిక రంగానికి ఆయన లేని లోటు పూడ్చలేనిది. కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య కుటుంబ సభ్యులకు, సీపీఎం పార్టీకి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

కుళ్లిన గుడ్లు... చిన్నారులకు చేటు!

(మొదటిపేజీ తరువాయి)

ఇదే అదనుగా కాంట్రాక్టర్ కుళ్లిన కోడిగుడ్లను ప్రాథమిక పాఠశాలలకు సరఫరా చేస్తూ చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో నిర్భయంగా కుళ్లిన గుడ్లు నిరంతరాయంగా సరఫరా చేస్తున్నాడని తల్లిదండ్రులు అంటున్నారు. వివరాల్లోకి వెళితే... అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మన్యం మండలం ఇరగాయి పంచాయతీ పరిధిలోని వలిదిపనస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఓ కాంట్రాక్టర్ నిల్వ ఉన్న గుడ్లు సరఫరా చేస్తున్నాడు. పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు మౌనంగా ఉండడాన్ని ఆసరాగా చేసుకుని నిర్భయంగా గుడ్లను సరఫరా చేస్తుండడం... తీరు మార్చుకోకపోవడంతో పాఠశాల కమిటీ చైర్మన్ బురిడీ రాజు, పీఏసీ చైర్మన్ గెమ్మెలి సుబ్బారావు, విద్యార్థుల తల్లిదండ్రులు బురిడీ బాబురావు, బురిడీ రాజ్ కుమార్, బురిడీ నీలకంఠం, కొర్ర దాసు, కొర్ర సంతోశ్, బురిడీ సోమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిన గుడ్లను తింటూ చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. ఎలాంటి ప్రాణాంతక వ్యాధి ప్రబలుతుందోనని ఆదోళన చెందుతున్నారు. దీనికితోడు వెండర్ సరిపడా గుడ్లను సరఫరా చేయడం లేదన్న ఆరోపణలూ హల్‌చల్ చేస్తున్నాయి. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వెండర్ పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడంలేదన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఇదే తంతు జరుగుతున్నా పట్టించుకోకపోవడం వెనక పెద్ద తంతే జరుగుతోందంటున్నారు. కాంట్రాక్టర్‌తో ముందుగానే కుమ్మక్కై కమీషన్ ఆశించి కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదంటున్నారు. పరోక్షంగా అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్ పాఠశాలలను సందర్శించి కుళ్లిన గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై సమగ్ర విచారణ జరిపి టెండర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన గుడ్లు సరఫరాచేసే వ్యక్తికి కాంట్రాక్ట్ అప్పగించాలని గిరిజనులు, విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జల కళ... జన కళ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుల వద్ద కేరింతలు కొడుతూ సెల్ఫీలతో సందడి చేస్తున్నారు. ఎగువ ప్రాజెక్టుల గేట్లు అన్నీ ఎత్తివేయడంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 70 గేట్లను ఎత్తి 3,05,088 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరోవైపు కాల్వల ద్వారా 13,768 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భారీ వరదతో అధికారులు దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కాల్వల ద్వారా విడుదల చేసే వరదనీరు పూడిక ప్రభావంతో రోడ్లపైకి చేరుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాన కొంతవరద ఉధృతి తగ్గినప్పటికీ దిగువున ఉన్న ప్రకాశం బ్యారేజీ వద్ద గురువారం వరద తాకిడి పెరిగింది. జూరాల సుంకేసుల నుండి శ్రీశైలం ప్రాజెక్టుకు 3,54,761 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా... జలాశయం నుండి దిగువ సాగర్‌కు స్పిల్‌వే 10 గేట్లు 12 అడుగుల మేర ఎత్తి దిగువకు 3,08,950 నీరు విడుదల చేస్తున్నారు. ఏపీ జలవిద్యుత్ ఉత్పత్తికి 26,826 క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తికి 38,528 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.60 అడుగుల నీరు ఉంది. జలాశయం పూర్తి సామర్థ్యం 215.907 టీఎంసీలు కాగా ప్రస్తుతం 202.5056 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో మొత్తం 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. 22 గేట్లు 5 అడుగులు, 4 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడిచి పెడుతున్నారు. ప్రాజెక్టుకు 2.69,714 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా... ఆ మొత్తం నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా... ప్రస్తుత నీటి మట్టం 585.30 అడుగులుగా ఉంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా... ప్రస్తుత నీటి నిల్వ 298.30 టీఎంసీలుగా నమోదైంది. పులిచింతలకు ఎగువ నుంచి 2.45 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. విద్యుదుత్పత్తి కోసం 15 వేల క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. మిగతా నీటిని గేట్లు ఎత్తి ప్రకాశం బ్యారేజీకి పంపిస్తున్నారు. పులిచింతల జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా... ప్రస్తుత నీటి నిల్వ 31.89 టీఎంసీలుగా నమోదైంది. వరద వస్తుండటంతో అధికారులు నీటిమట్టాల్ని అలాగే కొనసాగిస్తూ వచ్చిన వరద నీటిని వచ్చినట్లు దిగువకు పంపిస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టాక ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రైవేటు పల్లవి!

(మొదటిపేజీ తరువాయి)

అయినప్పటికీ, పూర్తిగా ప్రైవేట్ పరం అయిపోతాయి.

పవన్... మౌనమేల!

రెండో ప్రతిపాదనను చూస్తే... రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్ ఛార్జీ వసూలు చేయాలనే దానిపై తాజాగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రహదారులు గుంతలమయం, వాటి అభివృద్ధికి కృషి చేయాలేదంటూ జనసేన పార్టీ అధ్యక్షుడు, ప్రసుత్త ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆందోళన కూ దిగారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెనువెంటనే పవన్ సొంత నియోజకవర్గమైన పిఠాపురం నుంచే చెత్తపై పన్నుకు శ్రీకారం చుట్టారు. దానిపైనా అనేక విమర్శలు వస్తున్నప్పటికీ పవన్ ఇంతవరకూ స్పందించలేదు. నాడు రోడ్లు అభివృద్ధి చేస్తామని హామీతో వచ్చిన పవన్... ఇప్పుడు మొదట్లో డబ్బులులేవని... కొంత సమయం కావాలంటూ దాట వేస్తున్నారు. ఇవన్నీ ఒక వైపు చెబుతూనే తెరకింద పీపీపీ పద్ధతిలో రాష్ట్ర రహదారులపై టోల్ ట్యాక్స్‌లు విధించే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. ఇటీవల వెలగపూడి సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో అధికారులకు ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్లు ప్రచారం వెలుగులోకి వచ్చింది. అదే జరిగితే ఈ కూటమి ప్రభుత్వానికి సర్వత్రా వ్యతిరేకత ఎదురవుతుంది. భవిష్యత్‌లో మొత్తం 12,650 కిలోమీటర్ల పరిధిలోని రాష్ట్ర రహదారులపై పన్నుల వసూలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పీపీపీ పేరిట రాష్ట్ర రహదారుల్లో ప్రతిపాదిక టోల్‌టాక్సులు మోయలేని భారంగా మారి, రవాణా రంగాన్ని నష్టాలకు గురిచేస్తాయన్న వాదనలున్నాయి. మూడో అంశంగా ... విజయవాడ, రాజమండ్రి, తిరుపతి విమానాశ్రయాలను ప్రైవేట్‌కు అప్పగించే ఆలోచనలో ప్రభుత్వ ఉన్నట్లు తెలిసింది. ఇదే జరిగితే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ మూడు విమానాశ్రయాలు పూర్తిగా ప్రైవేట్ పరమవుతాయి. కొత్తగా నిర్మించబోయే విమానాశ్రయాలపైనా ప్రైవేట్ ముద్ర పడే అవకాశముంది.

పార్లమెంట్‌లో 'వక్ఫ్' మంటలు

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ ముందుకు రాగా... విపక్ష ఇండియా ఐక్యసంఘటన ఎంపీల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని పంపుతామని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కిరణ్ రిజిజు గురువారం దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై సభలో చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా విపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్రంపై ధ్వజమెత్తారు. ఈ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, మతపరమైన విభజనకు దారితీస్తుందని కాంగ్రెస్ దీన్ని ఖండించింది. ముస్లింల హక్కుల్ని లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని తాము అంగీకరించేదే లేదని, బిల్లును తక్షణమే వెనక్కు తీసుకోవాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు.

మతస్వేచ్ఛపై దాడి: కాంగ్రెస్

కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతి కోరిన వెంటనే, కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ దానిని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ నోటీసు సమర్పించారు. ప్రభుత్వం మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తోందని, దాని ద్వారా సమాఖ్య వ్యవస్థపై దాడి చేస్తోందని ఆరోపించారు. ఇది క్రూరమైన చట్టమని, రాజ్యాంగంపై దాడి అని వేణుగోపాల్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విభజన రాజకీయాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పినప్పటికీ హర్యానా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. 'ఇది మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి... తదుపరి మీరు క్రిస్టియన్లు, తరువాత జైనుల్ని లక్ష్యం చేసుకుంటారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి విభజన రాజకీయాలను దేశ ప్రజలు అంగీకరించరని స్పష్టం చేశారు.

- ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ... బీజేపీ తన కరడుగట్టిన మద్దతుదారులను ప్రసన్నం చేసుకునేందుకే ఈ బిల్లును తీసుకొచ్చిందన్నారు. 'ఇతర మత సంస్థలలో ఇలా చేయనప్పుడు ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డుల్లో చేర్చడం ఏమిటి?' అని యాదవ్ ప్రశ్నించారు. ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు.. బోర్డులో సభ్యులను ఎందుకు నామినేట్ చేయాలని ప్రశ్నించారు. ఏ మత సంస్థలలోనూ ఆయా కమ్యూనిటీకి చెందని వ్యక్తులు భాగస్వామ్యంగా ఉండరని, వక్ఫ్ సంస్థల్లో ముస్లిమేతరులను చేర్చడంలో ప్రయోజనం ఏంటని నిలదీశారు. ఈ బిల్లు మత స్వేచ్ఛకు విరుద్ధమని సమాజవాదీ పార్టీ ఎంపీ మొహిబుల్లా నద్వీ అన్నారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను నియమించడం అంటే... ఇతర సంస్థలలో ముస్లింల హక్కులను ఉల్లంఘించడమేనని తెలిపారు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపీ సుదీప్ బంధోపాధ్యాయ ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం, సమాఖ్య స్ఫూర్తిని కాలరాయడమేనని విమర్శించారు. 'ఇది ఆర్టికల్ 30 యొక్క ప్రత్యక్ష ఉల్లంఘన... ఈ బిల్లు నిర్దిష్ట మతాన్ని లక్ష్యంగా చేసుకునే తీసుకొచ్చారు. రాజ్యాంగానికి విరుద్ధం' అని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు.

స్టాండింగ్ కమిటీకి పంపాలి: ఎన్సీపీ

బిల్లును సభలో ప్రవేశపెట్టడానికి ముందు ప్రభుత్వం సమగ్ర సంప్రదింపులు జరపలేదని ఎన్సీపీ(శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. విస్తృత సంప్రదింపుల కోసం ఈ బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. ఉన్నపళంగా కేంద్రం ఈ బిల్లు తీసుకురావడానికి వక్ఫ్ బోర్డులో అకస్మాత్తుగా ఏమి జరిగింది అని ప్రశ్నించారు. 'బంగ్లాదేశ్‌లో ఏం జరుగుతోందో చూడండి. చాలా బాధగా ఉంది... మైనారిటీలను రక్షించడం దేశం నైతిక బాధ్యత' అని సూలే అన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 25, 26, 30లను ఉల్లంఘిస్తోందని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) సభ్యుడు ఇటీ మహమ్మద్ బషీర్ అన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే వక్ఫ్ వ్యవస్థ కుప్పకూలుతుందన్నారు. వక్ఫ్ భూముల ఆక్రమణలను ఈ బిల్లు ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.

ప్రాథమిక హక్కులకు భంగం: ఒవైసీ

మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ... వక్ఫ్ బిల్లుతో మత స్వేచ్ఛకు భంగం కలుగుతుంది. వక్ఫ్ సవరణ బిల్లు ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతకు, అధికారాల విభజనకు విఘాతం కలిగిస్తుంది. వక్ఫ్ ఆస్తులు మతపరమైన కార్యక్రమాల నిర్వహణ కోసం ఉన్నాయి. ఆర్టికల్-25కి భంగం కలిగేలా ఈ బిల్లు ఉంది. అల్లా పేరు మీద ఆస్తిని విరాళంగా ఇచ్చే అవకాశం లేకుండా చేశారు. దర్గా, మసీదుల ఆస్తులను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని చిన్నాభిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. కాగా బిల్లును సభలో ప్రవేశపెట్టే మందు ముస్లింల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని ఎంపీ మిథున్ రెడ్డి కోరారు. ఇక ఈ బిల్లును టీడీపీ, జేడీయూ, అన్నాడీఎంకే పార్టీలు మద్దతు తెలిపాయి.

బిల్లును సమర్థించుకున్న ప్రభుత్వం

మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వక్ఫ్ చట్టంలోని సమస్యలను పరిష్కరించలేకపోయినందున తమ ప్రభుత్వం సవరణలు తీసుకురావాల్సి వచ్చిందన్నారు. 'మీకు చేతకాకపోవడంతో ఈ సవరణలు తీసుకురావాల్సి వచ్చింది. మేం ఎన్నికైన ప్రజాప్రతినిధులం, ఈ బిల్లుకు మద్దతివ్వండి, కోట్లాది మంది ప్రజల మన్ననలు పొందుతారు.. కొందరు వక్ఫ్ బోర్డులను కబ్జా చేశారు. సామాన్య ముస్లింలకు న్యాయం చేసేందుకు ఈ బిల్లు తీసుకొచ్చాం. రాష్ట్ర వక్ఫ్ బోర్డులు మాఫియాగా మారాయని చాలామంది ప్రతిపక్ష నాయకులు నన్ను వ్యక్తిగతంగా కలిసి చెప్పారు. నేను వారి పేర్లను బహిరంగంగా చెప్పి వారి రాజకీయ జీవితాన్ని నాశనం చేయలేను' అని రిజిజు తెలిపారు. 'సచార్ కమిటీ నివేదిక మేరకు బిల్లును రూపొందించాం. బిల్లుపై దేశవ్యాప్తంగా సంప్రదింపులు జరిపాం. దీని వల్ల మతపరమైన స్వేచ్ఛకు ఆటంకం ఉండదు. ఇతరుల హక్కులను హరిస్తుందనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఇప్పటివరకు హక్కులు పొందని వారికి దీంతో ప్రయోజనం చేకూరుతుంది. వక్ఫ్ బోర్డులను మాఫియా ఆక్రమించిందని చాలా మంది ఎంపీలు చెప్పారు. కొందరు ఎంపీలు వ్యక్తిగతంగా ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని పార్టీలు సిద్ధాంతపరంగా మద్దతు ఇవ్వలేమని చెప్పాయి. వక్ఫ్ బోర్డులో వివిధ మతాల సభ్యులుండాలని మేం చెప్పట్లేదు. పార్లమెంట్ సభ్యుడు మాత్రం బోర్డులో ఉండాలంటున్నాం' అని కేంద్రమంత్రి వివరించారు. కొత్త బిల్లు అమలులోకి వస్తే జిల్లా కలెక్టర్లు రూపొందించిన వాస్తవ అంచనా విలువల మేర వక్ఫ్ బోర్డులు తమ ఆస్తులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. బీజేపీ సర్కారు ఎప్పట్నుంచో ఈ సవరణల గురించి ఆలోచిస్తోందని, ఇది సరైన నిర్ణయం కాదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇదివరకే ఈ బిల్లును వ్యతిరేకించింది.

'రియల్ ఎస్టేట్' సమస్యల పరిష్కారానికి కృషి: అనగాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రియల్ ఎస్టేట్ రంగం సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. నిర్మాణ రంగంపై లక్షలాది మంది కార్మికులతో పాటు, ఇతర రంగాలూ ఆధార పడి ఉన్నాయని అన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నెరెడ్కో) ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో మంత్రిని కలిసి తమ పరిశ్రమ ఎదుర్కొంటున్న విభిన్న సమస్యలను ప్రస్తావించారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విధానాల పై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అమరావతి సహా రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని ఇక్కట్ల పాలు చేశారని నెరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. భూసర్వే పేరిట ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని కోరారు. సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ, రాష్ట్ర కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కిరణ్ పరుచూరి తదితరులు మంత్రికి వివిధ సమస్యలు వివరించారు. స్పందించిన అనగాని... రియల్ ఎస్టేట్ సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు సానుకూలంగానే ఉన్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

విపత్తును రాజకీయం చేస్తారా?

- జీజేపీపై ముప్పాళ్ల నాగేశ్వరరావు మండిపాటు
- వయనాడ్ బాధితులకు సీపీఐ ఏపీ రాష్ట్ర సమితి చేయూత

విశాలాంధ్ర-విజయవాడ: కేరళలోని వయనాడ్ జిల్లాలో జరిగిన ప్రకృతి విలయం యావత్తు ప్రపంచాన్ని కదిలించిందని, ఇలాంటి సమయంలో ఇతోధికంగా తోడ్పడాల్సిన మోదీ ప్రభుత్వం... విపత్తును రాజకీయంగా వాడుకోవటానికి ప్రయత్నించటం దాని రాజకీయ దుర్బలత్వానికి నిదర్శనమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. వయనాడ్ బాధితుల సహాయార్థం సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో సేకరించిన వస్తువులను గురువారం లారీల ద్వారా కేరళకు పంపారు. ఈ సందర్భంగా విజయవాడ సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్ వద్ద ముప్పాళ్ల నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ వయనాడ్‌లో కొండచరియలు, అపార జలపాతం ఒక్కసారిగా విధ్వంసం సృష్టించి అద్భుతమైన పర్యాటక కేంద్రాన్ని స్మశానంలా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో కేరళ సర్కార్, దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సినీరంగ ప్రముఖులు, వ్యాపారస్తులు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికి భారత కమ్యూనిస్టు పార్టీ ఒక సాధనంగా ఉండి...వాటిని కేరళకు పంపుతున్నామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ, జంగాల అజయ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు బాధితులకు సహాయాన్ని సేకరించటానికి శ్రమపడ్డారని తెలిపారు. సేవాతత్పరులు అందించిన సహాయాన్ని విద్యార్థి సంఘం నాయకులు కేరళ తీసుకెళుతున్నారని తెలిపారు. గతంలోనూ విపత్తులు సంభవించినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు బాధితులకు బాసటగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. సహాయ సహకారాలు అందించే వారు కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల వందలాది కుటుంబాలు సమస్తం కోల్పోయాయని, బాధితులకు సహాయసహకారాలు అందించేందుకు సీపీఐ తరపున మిత్రులు, శ్రేయోభిలాషులు, సేవా సంస్థలు సేవా దృక్పథంతో ముందుకు వచ్చారని తెలిపారు. 11 క్వింటాళ్ల బియ్యం, 800 చీరలు, దుప్పట్లు, లుంగీలు, అండర్ గార్మెంట్స్ సేకరించినట్లు తెలిపారు. వెంకట రమణ పౌల్ట్రీస్ లిమిటెడ్ వారు ఇచ్చిన రూ.50 వేల విరాళంతో 500 పేట్లు, 500 గ్లాసులు కొనుగోలు చేశామన్నారు. మంగళగిరి చేనేత కార్మికులు చీరలు ఇచ్చారని, సీపీఐ సీనియర్ నాయకులు దివంగత సూర్యదేవర నాగేశ్వరరావు కుమార్తె రాగి మాల్ట్, కందిపప్పు తదితరాలు సేకరించి అందించారని, విజయవాడ నగరంలోని బుక్ పబ్లిషర్స్ 5 వేల నోట్ పుస్తకాలు ఇచ్చారని చెప్పారు. వివిధ రూపాల్లో సహాయం అందించిన వారికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.చెంచయ్య, కరవది సుబ్బారావు, బుట్టి రాయప్ప, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, రైతు నాయకులు జమలయ్య, మల్నీడి యల్లమందారావు, యువజన నాయకులు లంకా గోవిందరాజులు, విద్యార్థి సంఘం నాయకులు సాయి కుమార్, అయ్యప్ప, మోహన్, కార్తీక్, ఏఐటీయూసీ నాయకులు మూలి సాంబశివరావు, ఆంజనేయులు, వియ్యపు నాగేశ్వరరావు, తెడ్డు వెంకటేశ్వరరావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య బాధిత రైతులకు న్యాయం చేయండి

పవన్ కల్యాణ్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం నేమకల్లు-హిర్దేహాల్ మధ్య స్పాంజ్ ఐరన్ స్టీల్ ప్లాంట్ పరిశ్రమల కాలుష్యం నుండి రైతులను కాపాడి... పంటలు నష్టపోతున్న రైతులకు తగు న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం లేఖ రాశారు. 18 ఏళ్లుగా నేమకల్లు - హిర్దేహాల్ మధ్య ఐదు స్పాంజ్ ఐరన్ స్టీల్ ప్లాంట్ పరిశ్రమలు నడుస్తున్నాయని రామకృష్ణ తెలిపారు. గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల నుండి వచ్చి... అక్కడ భూములు కొనుగోలు చేసి పరిశ్రమలు నడుపుతున్నారని చెప్పారు. ఆయా పరిశ్రమల వల్ల సంభవించే కాలుష్యం, దుమ్మూ ధూళి వల్ల నేమకల్-హిర్దేహాల్ మధ్య పంట భూముల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పొలాలలో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, పత్తి, వేరుశనగ, కంది, జొన్న, మిర్చి వంటి వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారని పేర్కొన్నారు. పంటల సాగు కోసం విత్తనాలు, ఎరువులు, మందుల వాడకంతో ఎకరాకు రూ.30 వేల నుండి రూ.50 వేల వరకు ఖర్చవుతుందన్నారు. పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా అమలు చేయాలని ఎన్నోసార్లు పరిశ్రమ యజమానులతో రైతులు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఈ సమస్యలపై స్థానిక తహసీల్దార్, ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి అధికారి, కలెక్టర్‌కు రైతులు విన్నవించినప్పటికీ స్పందన లేదని విమర్శించారు. పరిశ్రమల యాజమాన్యం తమకు అనుకూలంగా ఉన్న కొందరు రైతులకు మాత్రమే 2, 3 సంవత్సరాల నుండి పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.1,800 నుండి రూ.2,200 ఇచ్చి చేతులు దులుపుకుంటున్నదని తెలిపారు. అప్పులు తెచ్చి వేసిన పంటలు పోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. పరిశ్రమల కాలుష్యం వల్ల గ్రామాల్లో చర్మవ్యాధులు, ఆస్మా వంటి దీర్ఘకాలిక వ్యాధులు, చిన్నపిల్లలకు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు సంభవిస్తున్నాయని వివరించారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిశ్రమల యాజమాన్యం నుండి ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం ఇప్పించాలని, పరిశ్రమలలో రక్షణ సౌకర్యాలు, కాలుష్య నియంత్రణ సక్రమంగా జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

చంద్రబాబుకు ముస్లిం మైనారిటీ సంఘాల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించి సెలెక్ట్ కమిటీకి పంపాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ గురువారం సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ముస్లిం సమాజానికి అనేక అపోహలు ఉన్నందున సమగ్ర చర్చ జరిగే విధంగా సెలెక్ట్ కమిటీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం... ముస్లింలకు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారని ఫారూఖ్ షిబ్లీ తెలిపారు. అనంతరం మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కు కూడా వినతిపత్రం అందించారు. ఉలేమా కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు ముఫ్తీ ఫారూఖ్, జామియత్ ఉలేమా ఏ హింద్ రాష్ట్ర కన్వీనర్ మౌలానా హుస్సేన్ అహ్మద్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ అబ్దుల్ గఫూర్, వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్ ఖాదర్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు షరీఫ్, టీడీ జనార్ధన్, శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తక్ అహ్మద్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా పలాస కిడ్నీ ఆసుపత్రి

చంద్రబాబుకు ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: శ్రీకాకుళం జిల్లా పలాసలోని కిడ్నీ పరిశోధనా కేంద్రం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య గురువారం లేఖ రాశారు. సీపీఐ ప్రతినిధి బృందం రెండు రోజుల క్రితం పలాసలోని కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని పరిశీలించిందని, కిడ్నీ బాధితులకు అండగా ఉండాల్సిన ఆసుపత్రి నిరుపయోగంగా మారిందన్నారు. పలాస కిడ్నీ పరిశోధనా కేంద్రంలో అవసరమైన వైద్యులు, సాంకేతిక పరిజ్ఞానం లేక కిడ్నీ రోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అక్కడ డయాలసిస్ యూనిట్‌లు మాత్రమే నడుస్తున్నాయే తప్ప పరిశోధన జరగడం లేదని, దీంతో రూ.60 కోట్లతో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అలంకారప్రాయంగా మిగిలిందన్నారు. ఇక్కడ కేవలం ఒక్క నెఫ్రాలజీ విభాగ వైద్యుడు మాత్రమే ఉన్నారని చెప్పారు. ఇక్కడ ఇద్దరూ లేదా ముగ్గురు నెఫ్రాలజీ విభాగ వైద్యులను నియమించడంతోపాటు విశాఖ కేజీహెచ్ నెఫ్రాలజీ విభాగంతో పలాస కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అందుకు అవసరమైన బడ్జెట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేలాయించాలన్నారు.

జాబ్ కార్డుల తొలగింపు దారుణం: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధి హామీ పనులు చేయడానికి పొందిన జాబ్ కార్డులను ఏకంగా 35 లక్షలు తొలగించినట్లు పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ప్రకటించడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. పనిచేసే వారి సంఖ్య తగ్గిందని చెప్పి బడ్జెట్‌లో కోతపెట్టడానికి కేంద్ర ప్రభుత్వ కుట్ర దాగి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే ప్రతి ఒక్కరు (జమ్మూ-కశ్మీర్ మినహా) జాబ్ కార్డు తీసుకోవచ్చు అని, తక్షణమే రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి విభజిత రాష్ట్రంలో 80 లక్షలు జాబ్ కార్డులు ప్రభుత్వాలు మంజూరు చేశాయని, 60-70 శాతం మించి పనులు కల్పించలేదని, పనికోసం అర్జీలు పెట్టుకున్నప్పటికీ పని చూపలేదని పేర్కొన్నారు. పదేళ్లుగా పెళ్లి చేసుకొని విడిగా ఉంటున్నప్పటికీ... పాత జాబు కార్డులతోనే పని చేస్తున్నారని వివరించారు. గతంలో ఒక జాబ్ కార్డుపై ఇద్దరు పని చేస్తే ప్రస్తుతం నలుగురు పనిచేయడంతో త్వరగా 100 రోజులు పూర్తవుతున్నాయని తెలిపారు. 16 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలని చట్టంలోనే ఉందని, ఈ చట్టాన్ని పక్కకు నెట్టి పేదలకిచ్చే నిధుల్లో కోత పెట్టడానికి జాబ్‌కార్డులు తగ్గించారన్నారు. మంగళగిరి ఎయిమ్స్ బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. 38 మంది వైద్యుల రాజీనామాపై కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బుద్ధదేవ్ మృతికి సీపీఎం సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతిపట్ల సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. విజయవాడ గవర్నరుపేట పార్టీ కార్యాలయంలో గురువారం బుద్ధదేవ్ చిత్రపటానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, నాయకులు సీహెచ్ బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు. గఫూర్ మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా, 2000 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. బుద్ధదేవ్ తన రాజకీయ ప్రస్థానాన్ని విద్యార్థి ఉద్యమంతో ప్రారంభించి... 1968లో డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్‌కు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారని, పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారని వివరించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా సాధారణ జీవితం గడిపారని, దాదాపు మూడు దశాబ్దాలు బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వంలో విశేషమైన కృషి చేశారని వివరించారు. అయన మరణంతో బెంగాల్ వామపక్ష ఉద్యమంలో ఒక అధ్యాయం ముగిసిందన్నారు.

వయనాడ్ బాధితుల కోసం నిత్యావసరాలు

సీపీఐ అధ్వర్యంలో గుంటూరు నుంచి తరలింపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: వర్షాలు, వరదలు ముంచెత్తడంతోపాటు కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో తీవ్రంగా నష్టపోయిన కేరళలోని వయనాడ్ ప్రాంత ప్రజలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ సహృదయంతో ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. వయనాడ్ బాధితుల సహాయార్థం సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సీపీఐ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో సేకరించిన బియ్యం, ప్లేట్లు, గ్లాసులు, బట్టలు, మంగళగిరిలో సేకరించిన చీరలు, బియ్యం తదితర నిత్యావసర వస్తువులను గురువారం వయనాడ్‌కు పంపించారు. సామాగ్రి లోడుతో కూడిన వాహనాన్ని గుంటూరులో జంగాల అజయ్‌కుమార్ జెండా ఊపి సాగనంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు సీపీఐ తన వంతు కృషి చేస్తుందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ పిడికిటి మల్లికార్జునరావు అధ్వర్యంలో ది గుంటూరు నగర బిల్డర్స్ అసోసియేషన్ ద్వారా 25 క్వింటాలు బియ్యం, చంద్ర రాజేశ్వరరావు పార్కు కార్యదర్శి ఆకిటి రామచంద్రుడు ఆధ్వర్యంలో బియ్యం, బట్టలు, నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యం, బట్టలు, ప్లేట్లు, గ్లాసులు బాధితుల సహాయార్థం పంపించినట్లు వెల్లడించారు. సేకరణ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, మంగా శ్రీనివాస్, చల్లా మరియదాసు, సమితి సభ్యులు నూతలపాటి చిన్న, జంగాల చైతన్య, గుంటూరు నగర బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమపై బాబు కపటప్రేమ

ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో రాయలసీమ లేకపోవడం దారుణం: ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: రాయలసీమపై సీఎం చంద్రబాబు కపటప్రేమ కురిపిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఓబులేసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జలవనరులశాఖ రూపొందించిన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో రాయలసీమ ప్రాజెక్టులు లేకపోవడం విచారకరమని అన్నారు. రాష్ట్రంలో ఐదు ప్రాజెక్టుల పూర్తికి రూ.8,734 కోట్ల వ్యయంతో లక్ష 71 వేల ఎకరాల కొత్త ఆయకట్టు, 14 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం చేపట్టబోయే ప్రాజెక్టుల జాబితాలో రాయలసీమలోని గాలేరు-నగరి, హంద్రీనీవా, తెలుగంగ, కేసీ కెనాల్ ప్రస్తావనే లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమలో నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తికానందు న వర్షాలపై ఆధారపడడంతో వరుస కరువులతో రైతులు నష్టపోతున్నారన్నారు. వేసవి ఆరంభంలోనే భూగర్భ జలాలు అడుగంటి గుక్కెడు మంచినీటి కోసం కటకటలాడాల్సిన పరిస్థితి ఎదురౌతోందన్నారు. రాయలసీమ కన్నీటి వెతలు తీరాలంటే కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లించాలన్న సంకల్పంతో జరిగిన పోరాటాలవల్ల చేపట్టిన ప్రాజెక్టులు పాలకుల నిర్లక్ష్యం వల్ల దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్నాయన్నారు. 1951లో కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు, నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ 2000 సంవత్సరం వరకు అమలుగడువు ఉన్నప్పటికీ ప్రాజెక్టులు పూర్తికాక నికరజలాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తో మిగులు జలాలను కూడా కోల్పోయామన్నారు. మిగులు జలాలపై హక్కుల కోసం పోరాడుతున్న ప్రభుత్వం మిగులు జలాల ఆధారిత ప్రాజెక్టులు పూర్తిచేసే బాధ్యతను విస్మరించడం శోచనీయమన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రంతో పూర్తి చేయించే బాధ్యత చంద్రబాబు నాయుడుదే అన్నారు. వారంలో ఒకరోజు పోలవరం అంటున్న సీఎం... రాయలసీమ ప్రాజెక్టుల ప్రాధాన్యతపై మాట్లాడకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. జగన్ పాలనలో ఎగువ భద్ర కు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం నీటిని గాలేరు నగరి గండికోట, తెలుగు, గంగ, హంద్రీనీవా, కేసీ కెనాల్, గోరకల్లు అవుకు రిజర్వాయర్లు నింపడం ద్వారా రాయలసీమలోని నెలకొన్న కరువును పారదోలాలని ఓబులేసు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

రమణ మృతి తీరనిలోటు: ఓబులేసు

విశాలాంధ్రబ్యూరో-విజయవాడ: సీపీఐ అనంతపురం జిల్లా సీనియర్ నాయకులు ఎంవీ రమణ మృతి అనంతపురం జిల్లాకే కాక రాయలసీమలోని జిల్లాల కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంత సమస్యల పరిష్కారానికి రమణ ఎంతగానో కృషిచేశారని శ్లాఘించారు. నిజాయితీతో వ్యవహరించే వారనీ, నిష్కర్షగా మాట్లాడేవారనీ, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేశారని తెలిపారు. రాయలసీమ సమగ్రాభివృద్ధి, నీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిరంతరం పరితపించే వారన్నారు. కరవు ప్రాంత ప్రజల కడగండ్లను తీర్చేందుకు ఆయన అసమాన కృషి చేశారని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో నాటితరం కమ్యూనిస్టు నాయకులలో చివరి వ్యక్తి అయిన రమణ మరణం అనంతపురం జిల్లాకే కాకుండా, యావత్ రాయలసీమ జిల్లాల పార్టీకి తీరనిలోటుగా పేర్కొన్నారు. రమణ మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని ఓబులేసు తెలిపారు.

ఏపీఈసెట్‌లో 20,969 సీట్ల భర్తీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2024) ద్వారా ఇంజినీరింగ్ రెండో సంవత్సరం ప్రవేశాలకు తుదిదశ 20,969 సీట్ల కేటాయింపు పూర్తి చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు, ప్రవేశాల కన్వీనర్ గుమ్మల గణేశ్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ఈ నెల 13వ తేదీ లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో వ్యక్తిగతంగా, ఆ తర్వాత కళాశాలల్లో నేరుగాను సంప్రదించాల్సి ఉందన్నారు. తుదిదశ ప్రవేశాల అనంతరం 240 కళాశాల్లో 41,922 సీట్లు ఉండగా, 20,969 భర్తీ అయినట్లు వివరించారు. 19 విశ్వవిద్యాలయ కళాశాలల్లో 2,181 సీట్లకుగాను 1,823 మంది సీట్లు పొందారన్నారు. 221 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 39,741 సీట్లుకుగాను 19,146 సీట్లు భర్తీ చేశామని పేర్కొన్నారు. ఏపీ ఈసెట్‌లో 32,881 మంది అర్హత సాధించగా, తుది దశ కోసం 2,128 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఆయా కళాశాలల యాజమాన్యం ఈనెల 14లోగా భర్తీ అయిన సీట్లు, విద్యార్థుల వివరాలను సాంకేతిక విద్యా శాఖకు పొందుపరచాలని కన్వీనర్ సూచించారు.

'రాజదండం' స్థానంలో రాజ్యాంగం

డీహెచ్‌పీఎస్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగిస్తోందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) నేతలు విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక సూత్రాలన్నింటినీ నిర్వీర్యం చేసి దేశంలో చక్రవర్తి తరహా పాలన తీసుకురావటానికి ప్రయత్నిస్తుందని ధ్వజమెత్తారు. దానిలో భాగంగానే పార్లమెంట్‌లో రాచరిక వ్యవస్థకు చిహ్నం అయిన రాజదండం (సెంగోల్) ప్రతిష్ఠాపన చేసిందన్నారు. రాజదండం తొలగించి రాజ్యాంగం ప్రతిష్ఠించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న గవర్నర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం ... అంబేద్కర్ ప్రసాదించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాజ్యాంగ వ్యతిరేకంగా పాలన చేస్తూ ప్రజల హక్కులను, స్వేచ్ఛను కాలరాచి చక్రవర్తి తరహా పాలన తీసుకురావాలని కుట్ర చేస్తుందని మండిపడ్డారు. సంఘ్ పరివార్ సిద్ధాంతమైన మనుధర్మ శాస్త్రాన్ని జనబాహుళ్యంలోకి విస్తృతంగా వ్యాప్తి చేసి సమాన హక్కులకు, సామాజిక న్యాయానికి తూట్లు పొడిచి మధ్యయుగాల నాటి మనుధర్మ రాజ్యాంగాన్ని అమలు చేయాలన్న కుట్రలో భాగంగానే నూతన పార్లమెంట్లో ప్రతిష్ఠించిన రాజదండమే నిదర్శనమని అన్నారు. దేశ ప్రజలను బానిసత్వంలోకి నెట్టి రాజ్యాధికారాన్ని చలాయించడానికి పెట్టుబడిదారులు, ఫ్యూడల్ శక్తులు, కుయుక్తులు పన్నుతున్నారన్నారు. అదాని, అంబానీ సంపద పెరగడమే అభివృద్ధి అని గుడులు, గోపురాలు కట్టడమే అభ్యుదయమని ప్రజల మెదడులలో విష బీజాలు నాటుతున్న మోదీ ప్రభుత్వ అరాచకాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజలను చైతన్యవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మతతత్వ, కులతత్వ, ప్రాంతీయ అసమానతలతో పరిపాలన కొనసాగుతోందనడానికి నిదర్శనమే పార్లమెంట్‌లో రాజదండం ప్రతిష్ఠాపన అన్నారు. రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా రామన్ మెగసెసె అవార్డు గ్రహీత, సఫాయి కర్మచారీ అందోళన్ నేత (న్యూఢిల్లీ) బెజవాడ విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరవుతున్నారని వివరించారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రభుత్వ విద్య పరిరక్షణకు వేదిక కాబోతున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జులు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. నేడు కేంద్రం, రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై జరుగుతున్న దోపిడీని తిప్పి కొట్టడానికి, విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయకరణ జరుగుతున్న నేపథ్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నవంబరు 27 నుంచి 30 వరకు ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఎన్నిక స్థానిక అమర్ భవన్‌లో గురువారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్, కేంద్ర విమానయాన శాఖ మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, అధ్యక్షుడిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, చీఫ్ అడ్వైజర్‌గా సీబీఐ మాజీ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎన్.నాగభూషణం, కోశాధికారిగా ఎస్.రంగరాజు ఎన్నికయ్యారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి, షేక్ మస్తాన్, ఫణీంద్ర, సాయికుమార్, కుల్లాయి స్వామి, నాగభూషణం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, ఆనందరావు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్, జిల్లా కార్యదర్శి సూరిబాబు, ఏఐఎస్ఎఫ్ ఉత్తరాంధ్ర మాజీ నాయకుడు పి.నరసింహులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, రఘు విద్యాసంస్థల కరస్పాండెంట్ డి.రఘు, ప్రజాసంఘాల ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
నెం.59 టు 65/ఎటిఓ/2024-25, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది : 05-08-2024
కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్, పి.ఐ.యు. డివిజన్ ఏలూరు జిల్లాలోని 23% జెడ్‌పి జిఎఫ్ గ్రాంట్‌లో మంజూరు కాబడిన 7 పనులకు అంచనా విలువ : రూ.70.00 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్ల లభ్యత : 10-8-2024 నుండి. ఇతర వివరాలను ఇ-మార్కెట్‌ప్లేస్ www.ap.eprocurement.gov.in నుండి పొందవచ్చును.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పి.ఆర్., పి.ఐ.యు. డివిజన్, ఏలూరు
DIPR/13847/CL/ADVT-1/1/2021-22 Dt. 08-08-2024

సంపాదకీయం

వక్ఫ్ చట్ట సవరణ వెనక విద్వేషం

ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం లోక్‌సభలో వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని ప్రతిపాదించారు. అదే సమయంలో ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జె.పి.సి.) కి పంపించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. సాధారణంగా ఏ బిల్లునూ స్థాయీ సంఘాల, సంప్రదింపుల కమిటీకి కూడా పంపించడానికి నిరాకరించే మోదీ ప్రభుత్వం ఈ బిల్లును జె.పి.సి.కి పంపడానికి సుముఖత వ్యక్తం చేయడంతో ప్రభుత్వం జె.పి.సికి పంపింది. 1995 నాటి వక్ఫ్ చట్టాన్ని సవరించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో 44 సవరణలు చేయాలనుకుంటోంది. అందులో నాలుగైదు ప్రధానాంశాలు ఉన్నాయి. మొట్ట మొదటిది 1995 నాటి చట్టం పేరే మార్చేయడం. వక్ఫ్ విస్తృత లక్ష్యాలను ప్రతిబింబించేలా వాటి నిర్వహణ, అధికారాలు, వక్ఫ్ ఆస్తులను అభివృద్ధి చేయడం. రెండవ ముఖ్యమైన అంశం 40వ సెక్షన్‌ను పూర్తిగా తొలగించడం. ఇప్పుడున్న 40వ సెక్షన్ ప్రకారం ఒక ఆస్తి వక్ఫ్‌దో కాదో నిర్ధారించే అధికారం వక్ఫ్ బోర్డులకే ఉంది. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సవరణ ప్రకారం వక్ఫ్ ఆస్తుల వర్గీకరణలో మార్పులు సాధ్యం అవుతాయి. మూడవది: వక్ఫ్ బోర్డులలో ఎవరు ఉండాలన్న అంశానికి సంబంధించింది. ఇందులో ముస్లిం మహిళలకు కూడా ప్రాతినిధ్యం ఉండాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇది ఆహ్వానించదగిన సవరణే. దానితో పాటు హిందువులకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలనుకుంటున్నారు. ప్రతిపక్షాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇతర మతాలవారిని వక్ఫ్ బోర్డుల్లో సభ్యులుగా నియమించడం ముస్లింల మతపరమైన హక్కులను కాల రాయడమేనని ముస్లిం వర్గాలు, ప్రతిపక్షాలు కూడా వాదిస్తున్నాయి. నాల్గవది: దీనికి తోడు దావూదీ బోహ్రాలు, ఆగాఖానీల కోసం ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తోంది. షియాలకు, సున్నీలకు, ఇతరులకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయిదవది: వక్ఫ్ ఆస్తులను ఒక కేంద్ర పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేయించడం. రెవెన్యూ చట్టాలకు అనుగుణంగా ఆస్తులను విభజించడం. ఈ బిల్లును ప్రతిపాదించడానికి మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లేచి నిలబడగానే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ, డి.ఎం.కె.సభ్యులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సవరణ బిల్లు రాజ్యాంగం మీద, మత స్వేచ్ఛ మీద, ఫెడరల్ వ్యవస్థ మీద బాహాటమైన దాడి అనీ, కిరాతకమైందని ప్రతిపక్షాలు అంటున్నాయి. 1995 నాటి వక్ఫ్ చట్టం రూపు రేఖలను సంపూర్ణంగా మార్చడంతో పాటు కాల దోషం పట్టిన 1923 నాటి చట్టాన్ని రద్దు చేయడానికి విడిగా మరో బిల్లు ప్రతిపాదిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరించారు.

ఈ బిల్లును జె.పి.సి.కి పంపడం వల్ల ఫలితం ఎలా ఉంటుందో తెలియదు. కానీ ప్రభుత్వం ఉద్దేశించిన రీతిలో ఆమోదం పొందితే దేశంలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ సమూలంగా మారిపోతుంది. ఇంతవరకు అన్ని ముస్లిం వర్గాలకు కలిపి ఒకే వక్ఫ్ బోర్డు ఉంది. ప్రతిపాదిత చట్టం అమలులోకి వస్తే దావూదీ బోహ్రాలకు, ఆఘాఖానీలకు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు అవుతాయి. అంటే ఇస్లాం మతానుయాయుల్లో ఉన్న వివిధ శాఖల వారి మధ్య చీలికలు తేవాలన్న సంకల్పం మోదీ ప్రభుత్వానికి బలంగాఉంది. ఏ మతంలోనైనా భిన్నమైన శాఖలు ఉన్నాయి. ఉంటాయి. వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల దురాక్రమణను నివారించడం ఈ సవరణ బిల్లు పరమ లక్ష్యం అని కిరణ్ రిజిజు అంటున్నారు. వక్ఫ్ బోర్డుల ఆస్తులు అన్యాక్రాంతమైన సందర్భాలు లేవని కాదు. వక్ఫ్ బోర్డులకు ఆస్తులు దానధర్మాల వల్ల సమకూరినవే. ఈ దానాలన్నీ దేవుడికి చెందినవే తప్ప వ్యక్తులకు, సంఘాలకు, సంస్థలకు వాటి మీద ఎలాంటి హక్కూ ఉండదు. వక్ఫ్ లక్ష్యం సమాజ సేవ, సమాజ సంక్షేమం. వక్ఫ్ వ్యవహారాలు నడిపే వారు నిర్వాహకులే తప్ప ఆ ఆస్తులకు యజమానులు కారు. వక్ఫ్ బోర్డులు ముస్లింలకు చెందినవే అనడం ఎంత సత్యమో ఈ బోర్డుల మీద ప్రభుత్వ ఆధిపత్యం ఉందనడం అంతకన్నా ఎక్కువ సత్యం. వక్ఫ్‌లో ప్రభుత్వానికి పాత్ర లేదనడం కేవలం అసత్య ప్రచారమే. 2009 నుంచి వక్ఫ్ ఆస్తులు రెట్టింపైనాయన్న ఆరోపణ ఉంది. వక్ఫ్ దగ్గర ఉన్న డబ్బును విద్య, అభివృద్ధి, సంక్షేమంకోసం ఖర్చు పెట్టాలన్న నియమం ఎప్పటి నుంచో ఉంది. హిందువులు కూడా వక్ఫ్ బోర్డుకు ఆస్తులు దానం ఇవ్వొచ్చు. అయితే అది హిందూ ధర్మానికి, హిందువులకు వర్తించే చట్టాలకు అనుగుణంగా ఉండాల్సిందే. ప్రభుత్వం దీన్నే తిరగేసి వక్ఫ్ దగ్గర ఉన్న డబ్బును భర్తను కోల్పోయిన వారి, విడాకులు పుచ్చుకున్నవారి, అనాథల సంక్షేమానికి వెచ్చించాలని పాత లక్ష్యాలకు కొత్త ముసుగు తొడుగుతోంది. వక్ఫ్ బోర్డుల్లో ఇతర మతాల వారికి కూడా ప్రాతినిధ్యం కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం మాత్రం కచ్చితంగా ముస్లింల వ్యతిరేక వైఖరివల్ల ఉత్పన్నమైందే. హిందూ ఆలయాలు, ధర్మ కర్తృత్వ సంస్థలలో హిందువులు కాని వారికి ప్రాతినిధ్యం లేనప్పుడు ముస్లింల విషయంలోనే ఈ నియమం ఎందుకు అన్నది అత్యంత సామాన్యులకు కూడా రావలసిన అనుమానమే. వక్ఫ్ బోర్డులకు మసీదులు నిర్మించే అధికారంలేదు. కానీ ఆసుపత్రులు, విద్యాలయాలు, ధర్మ సంస్థలు ఏర్పాటు చేయొచ్చునన్న నియమం ఎప్పటి నుంచో ఉంది. ఎప్పటి నుంచో ఉన్న ఈ సానుకూల అంశాలను మార్చడంలో ప్రభుత్వ ముస్లిం వ్యతిరేక భావన లేదని అనుకోలేం. వక్ఫ్ ఏర్పాటు చేయడానికి ముస్లింలే కానక్కర లేదన్న 1921 నాటి తీర్పు కూడా ఉంది. వక్ఫ్ ఆస్తులు సర్వే చేయడానికి సర్వేయర్‌ను నియమించేదీ ప్రభుత్వమే. ఈ సర్వేయర్ వక్ఫ్ ఆస్తుల జాబితా తయారు చేయాలి. ఈ సర్వేయర్‌కు సివిల్ కోర్టులకు ఉండే అధికారాలు ఉంటాయి. సాక్షులను పిలిపించే అధికారమూ ఉంటుంది. ప్రభుత్వం కావాలనుకుంటే మరోసారి కూడా సర్వే చేయించవచ్చు. వక్ఫ్ బోర్డు నిర్వాహకులను కూడా ప్రభుత్వమే నియమిస్తుంది. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన వివరాలను గెజెట్ ఉత్తర్వు ద్వారా ప్రభుత్వం ప్రకటిస్తుంది. వివాదాలు వస్తే నిర్వాహకులు (ముతవల్లీలు) ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలి. ట్రిబ్యునల్ తీర్పులపై హై కోర్టుకో, సుప్రీంకోర్టుకో వెళ్లాల్సిందే. ఈ ట్రిబ్యునళ్లలో ముస్లింలు మాత్రమే ఉండాలన్న నియమేమీ లేదు. వక్ఫ్‌ల నిర్వహణకు కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ ఉంటుంది. దానికి అధిపతి కేంద్రమంత్రి. జమా ఖర్చుల ఆడిట్ నిర్వహిం చడం కూడా ప్రభుత్వం అధీనంలోనే ఉంటుంది. ఇన్ని కట్టుదిట్టాలున్న వక్ఫ్ వ్యవహారాలకు వర్తించే చట్టాన్ని సవరించాలనుకోవడంలో ముస్లిం వ్యతిరేకత తప్ప మరో లక్ష్యం కనిపించదు. ముమ్మారు తలాక్ నిషేధం మొదలైనవి ముస్లిం మహిళల సంక్షేమానికేనని మోదీ ప్రభుత్వం చేసుకున్న ప్రచారాన్ని ఎలా మరిచి పోగలం!

విద్యపైనా ఎడాపెడా పన్ను!

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

నిత్య జీవితావసరాల సరఫరాతో పాటు ప్రజల చదువులు, ఆరోగ్యం! రోగనిరోధం, వైద్యం, చికిత్స ప్రభుత్వాల బాధ్యత. ఈ బాధ్యత నుంచి ప్రభుత్వాలు తప్పుకున్నాయి. వీటి ఖర్చులను 99శాతం ప్రజలు భరించలేరు. ప్రభుత్వరంగ బీమాసంస్థలు తక్కువ ప్రీమియంతో ఎక్కువ సౌకర్యాలు అందిస్తాయి. లాభాల నుంచి దేశాభివృద్ధికి నిధులు ఇస్తాయి. బీమా రంగ లాభాలను దోచుకోవటానికి ప్రైవేటు బీమా సంస్థలు పుట్టాయి. వస్తువాహనాల భద్రత బాధ్యత కూడా ప్రభుత్వాలదే. వస్తువులకు, వాహనాలకు నష్టంచేయని ప్రమాద నివారణ జాగ్రత్తలను, సౌకర్యాల కల్పనలను ప్రభుత్వాలు చేపట్టాలి. ప్రజారోగ్యం, వస్తువాహనాల భద్రతలను కాపాడలేని ప్రభుత్వాలే బీమా ఖర్చులను భరించాలి. ప్రభుత్వాలు ఈ ఖర్చులను ప్రజలపైనే రుద్దుతున్నాయి. స్పృహ జాగ్రత్తలు తెలిసినవారే జీవిత, వస్తువాహనాల బీమా చేసుకుంటారు. బీమా వస్తువూ కాదు, సేవా కాదు. ప్రభుత్వాలు వదిలేసిన బాధ్యత. ప్రజలుమోస్తున్న బరువు. వీటిపై జి.యస్.టి. విధించకూడదు. మోదీ సర్కారు జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై 18శాతం జీఎస్టీ విధించడంపై అన్ని వర్గాల నుంచి విమర్శలు



వెల్లువెత్తడంతో కేంద్రం ఆ ప్రతిపాదనను వెనక్కు తీసుకున్నది. ఒక్క ఆరోగ్య బీమా ప్రీమియంలపైనే 2023-24 ఆర్థిక సంవత్సరానికి 8,263 కోట్లు వసూలయిందని కేంద్ర మంత్రి లోక్‌సభకు తెలిపారు. మన దేశంలో ప్రాథమిక హక్కు అయిన విద్యను ప్రైవేటీకరించారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో కార్పొరేటీకరించారు. విద్యార్థులను మార్కుల యంత్రాలుగా, డాలర్ల సంపాదకులుగా మానవత్వం నుంచి మనిషితత్వం వైపుగా పాశవిక స్థితికి దిగజార్చుతున్నారు. విద్యాసంస్థల్లో బోధించే విద్య పోటీ పరీక్షలకు పనికిరాదు. 10 రకాల ప్రవేశ పరీక్షలకు కోచింగ్ కేంద్రాలు తయారయ్యాయి. 2024కు మూడొంతుల విద్యార్థులకు అనగా 10 కోట్ల మందికి ప్రవేశ పరీక్షలు అవసరాలుగానే గాక జీవనవిధానంగా మారాయి. ప్రభుత్వాలు ఉపాధి కల్పన నుంచి తప్పుకున్నాయి. ఫలితంగా అతి తక్కువ వృత్తి విద్యలకు, ఉద్యోగాలకు పెద్ద సంఖ్యలో విద్యార్థుల మధ్య పోటీ అనివార్యమయింది. 2015 లో రూ.24 వేల కోట్లుగా ఉన్న కోచింగ్ మార్కెట్ 2022నాటికి రూ.58 వేల కోట్లకు పెరిగింది. 2028 కి రూ. 1.33 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. మోదీ సర్కారులో ఇది విపరీతంగా పెరిగింది. పిల్లలకు చదువు చెప్పడం ప్రభుత్వాల సామాజిక బాధ్యత. ఇది వస్తుసేవల పరిధిలోకి ఎలా వస్తుంది? 2014 కు ముందు విద్యపై జీఎస్టీ లేదు. కోచింగ్ కేంద్రాల నుంచి కోచింగ్ రుసుముల ఆదాయ పన్ను వసూలు చేయాలి. కోళ్ల ఫారాలుగా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి ఆదాయ పన్ను వసూలుచేసే ధైర్యం ప్రభుత్వాలు చేయలేవు. విద్యపై 2021లో 2,215 కోట్లు, 2024లో 5,517 కోట్లు18శాతంతో జీఎస్టీ వసూలైంది. మూడేళ్లలో 149శాతం పెరిగింది. 2023-24 విద్యా సంవత్సర లెక్కల ప్రకారం విద్యా సంస్థల నుంచి ఉత్తీర్ణులైనవారిలో 51శాతం మాత్రమే ఉద్యోగాలకు పనికి వస్తారు. ఉద్యోగ ప్రావీణ్యతలను పెంచుకోడానికి 2014 కు ముందు జీఎస్టీ లేదు. 2023 లో 18శాతం జీఎస్టీతో ఈ ఖర్చు 34 వేల కోట్లు. విద్యార్థుల ప్రయాణ ఖర్చు, భద్రత సౌకర్యాలు, వసతి గృహాల శుభ్రత, నిర్వహణ ఖర్చు, తిండిపై 18శాతం జీఎస్టీ విధించారు. వీటిపై 2014 కు ముందు జీఎస్టీ లేదు. రేజర్లపై 5శాతం, పెన్సిళ్లు, వాటి ముక్కులు చెక్కే పరికరాలు, జామెట్రీ బాక్సులపై 12శాతం జీఎస్టీ, ప్రాథమిక విద్యపై 3శాతం, ఉన్నత విద్యపై 4శాతం ఎడ్యుకేషన్ సెస్సు విధిస్తారు. విద్యపై 2024 లో 62,250 కోట్ల జీఎస్టీ వసూలైంది. విద్యార్థులు విద్యపై 2024 విద్యా సంవత్సరంలో 26.3 లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. ఈ ఖర్చు భరించలేనివారెందరో! ఉత్పాదక శక్తిసామర్థ్యాల దేశ నిర్మాతలు, భావిభారత పౌరులు ఎలా తయారవుతారు? ఇన్ని ఖర్చులతో విద్యను కొన్న విద్యార్థులు పౌరజ్ఞానం, సామాజిక బాధ్యతలు గల పౌరులుగా తయారవుతారా? సామాన్యుల ప్రయాణ సాధనాలైన రైల్వే వస్తువులు, భాగాలు, విద్యార్థుల పెన్నులు, మాధ్యమాల పరికరాలు, ముద్రింపు, శబ్దనమోదు పరికరాలు, లైసెన్సులు, అచ్చయిన సమాచారం, ప్యాకేజి పెట్టెలపై12 నుండి 18శాతానికి, లోహాలు, తుక్కు, ప్లాస్టిక్, పాలిథిన్‌లపై 5 నుంచి 18శాతానికి, విద్యుత్తును పొదుపుచేసే సోలార్ కుక్కర్లు, జీవన అత్యవసరాలైన ఇంధన పునరుత్పత్తి పరికారాలపై 5 నుండి 12శాతానికి, పిల్లల పాల డబ్బాలపై 0 నుండి 12శాతానికికి జీఎస్టీని పెంచింది. సంపన్నులు కొనే బంగారంపై 3శాతం, విలువ రాళ్లపై 0.25శాతం మాత్రమే ప్రత్యేక స్థాయి పన్నులు విధించడం విచిత్రం. బీమాపై పన్నును పూర్తిగా తొలగించాలని కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి, ప్రహ్లాద్ జోషి ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కు రాసిన లేఖల్లో చిత్తశుద్ధిని చూడలేము. తమను కలిసిన ఉద్యోగ ఓటర్ల తృప్తికి, మోదీపై తమ అసంతృప్తితో రాసినవే ఈ ఉత్తరాలు. నిర్మల నిస్సహాయురాలని, మోదీ సూత్రధారి అని ఈ వరిష్ఠ బీజేపీ నాయకులకు తెలియదా? వీరు తమ శాఖలలో ఆశ్రితపక్షపాతులే. ప్రజా పక్షపాతులు కారు. మంత్రివర్గ సమావేశంలో వీరు బడ్జెట్‌ను ఆమోదించారు. బడ్జెట్ లో అన్యాయాలు వీరికి అప్పుడు కనిపించలేదా?

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
సెల్: 9490 20 4545

బంగ్లాదేశ్ పరిణామాలు-విశ్వగురు వైఫల్యం

సురవరం సుధాకరరెడ్డి

బంగ్లాదేశ్ పరిణామాలు మన దేశాన్ని కూడా నిర్ఘాంత పరిచాయి. నాలుగవసారి ప్రధాని అయిన కొద్ది నెలలకే షేక్ హసీనా వాజెద్ అవమానకరంగా దేశం విడిచి భారత్‌కు పారిపోయారు. ఆమె పాలనలో దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందినా, మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదు. నిరుద్యోగం సాధారణంగా పెరిగింది. దీనికి అవినీతి ఆరోపణలతోపాటు నియంతృత్వ పాలన ప్రధాన కారణం కావచ్చు. హత్యలు, లూటీలు, కొన్ని దేవాలయాలపై దాడులు, ముజిబర్ రహ్మాన్ విగ్రహ ధ్వంసం, ఇవన్నీ యాదృచ్ఛికం కావు. ముజిబర్ హత్యపై సినిమా తీసినందుకు ఒక సుప్రసిద్ధ హీరోను, ఆయన తండ్రిని దారుణంగా హత్య చేశారు.

ఈ ఘటనల వెనక ఇస్లాం మత సంస్థ జమాయత్-ఎ-ఇస్లామ్ వుండే అవకాశంఉంది. సీఐఏ ఉందని కూడా ఆరోపణలు వస్తున్నాయి. హసీనా అమెరికా వ్యతిరేక వైఖరి వారికి నచ్చలేదు.

మోదీ ప్రభుత్వం, అజిత్ దోవల్, విదేశాంగమంత్రి జై శంకర్ ఈ పరిణామాలు ఊహించడంలో ఘోర వైఫల్యం చెందారు. షేక్ హసీనాకు సరైన హెచ్చరిక చేయడంలో విఫలమయ్యారు. ఇరుగు పొరుగు దేశాల్లో భారత్‌తో స్నేహంగా ఉన్న ఏకైక దేశం బంగ్లాదేశ్. దిక్కుతోచని స్థితిలో మొదటిసారి అఖిలపక్ష సమావేశం జరిపి చర్చించారు. అదొక సానుకూల పరిణామం. ఇంకా అనేక విషయాలు బయటకు రావలసివుంది. ఆందోళనకారులలో విద్యార్థులు, జమయితీలు వేరు వేరా? కలసి చేశారా? బహిర్గతం కావాలి. బంగ్లాదేశ్‌లో మతోన్మాదం పెరిగిపోతున్నది. ఇది మన దేశానికి ప్రమాదకరం. దేశం అష్ట దిగ్బంధనంలో ఉందనిపిస్తోంది.

మిలిటరీ పాలకుడు జియా ఉర్ రెహమాన్ సతీమణి బేగం ఖలీదా జియా. ఆయన హత్యానంతరం ఆమె అధికారంలోకి వచ్చారు. ఇస్లామిక్ మతోన్మాద సంస్థ జమాయత్-ఎ-ఇస్లామ్ ఆమెకు మద్దతు ఇచ్చింది. ఆ సంస్థకు యాభైవేల మంది పూర్తి కాలం పనిచేసే పెయిడ్ హోల్ టైమర్లు ఉన్నారని వర్కర్స్ పార్టీ నాయకులు మాతో చెప్పారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ఆ సంస్థను నిషేధించింది. మతం ప్రాధాన్యత అసాధారణంగా పెరిగిపోతున్నది. బంగ్లాదేశ్‌లో ఇప్పటికీ కోటి ముప్పయి లక్షల మంది హిందువులున్నారు. కొన్ని లూటీలు జరిగాక విద్యార్థి నాయకులు గత రెండు రోజులుగా హిందువుల ఇళ్లపై దాడి జరగకుండా కాపలా కాస్తున్నారన్న వార్తలు కొంత సానుకూల వాతావరణం కలగచేస్తోంది.

ఈ సందర్భంలో మన విదేశాంగ విధానం గురించి పునరాలోచించవలసిన అవసరం ఉంది. హసీనా దేశం విడిచి పారిపోయివస్తే, ఆమెకు ఆశ్రయం తాత్కాలికంగా కలిగించడం సరైందేకానీ, భారత సెక్యూరిటీ అత్యున్నత అధికారి అజిత్‌దోవల్ ఆమెకు స్వాగతం చెప్పటం, అది మీడియాలో ప్రచారం కావడం అర్థంలేనిది. ఇది బంగ్లాదేశ్‌తో భారత్ పట్ల మరింత వ్యతిరేకతకు దారితీస్తుంది. దేశాల మధ్య సంబంధాలు సున్నితమైనవి. మన ఇరుగుపొరుగులో ఎవరు అధికారంలో ఉన్నా ఆ దేశాలతో సంబంధాలు కొనసాగాలి. ఏ పార్టీ, లేక ఏ నాయకుడు పట్ల సానుకూలత ఆదేశాలతో సంబంధాలకు అడ్డుకాకూడదు.

గతంలో భారత విదేశాంగ విధానం అన్ని పార్టీలు అంగీకరించిన జాతీయ విధానంగా ఉండేది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అది మారింది. గతంలో పాకిస్థాన్‌లో తప్ప అన్ని పొరుగుదేశాలతో సత్సంబంధాలు ఉండేవి. ఇప్పుడు అవన్నీ దూరమయ్యాయి. అలీన దేశాలకు నాయకురాలిగా భారత్ గర్వకారణమైన పాత్ర నిర్వహించింది. మోదీ వ్యక్తిగత ధోరణలు, విశ్వ గురువుగా ప్రకటించుకోవడం, మనదేశాన్ని ఒంటరి చేసింది.

మోదీ విదేశీ పర్యటనల్లో దేశాల మధ్య సంబంధాలకన్నా, తన ఆశ్రిత కార్పొరేట్లకు సహాయంచేసే ప్రయత్నంలో భాగంగా ఫ్రెంచి అధ్యక్షుడితో అనిల్ అంబానీకి సహాయం చేయమని మోదీ కోరినట్లు చెప్పడం, ఆస్ట్రేలియాలో అదానీకి బొగ్గు గనులు ఇప్పించడంతో ప్రజాందోళన జరగడంతో భారత ప్రతిష్ట దిగజారింది.

నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విదేశాంగ విధానం వ్యక్తిగత స్థాయికి దిగజారింది. గత పర్యాయం అమెరికా అధ్యక్ష ఎన్నికలలో అనవసరంగా వేలుబెట్టి "అబ్ కీ బార్ ట్రంప్" అని నినాదం ఇచ్చి అభాసుపాలయ్యారు. బైడెన్ అధ్యక్షుడయ్యాడు. భారతీయులలో ఎక్కువమంది డెమొక్రటిక్ పార్టీకి ఓట్లు వేశారు. మోదీ శ్రీలంకలో మహేంద్ర రాజపక్సను తనస్నేహితుడని ప్రకటించుకున్నాడు. ఆయనని ప్రజలు దేశం నుంచి వెళ్లగొట్టారు. ప్రస్తుత అధ్యక్షుడు బహిరంగంగా చైనా అనుకూలవైఖరి తీసుకుంటున్నారు.

మన ఇరుగుపొరుగు దేశాలలో ఏ ఒక్కరితో సంబంధాలు బాగాలేవు. చైనాతో సరిహద్దు తగాదాయేగాక ఇతర సమస్యలున్నాయి. పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థికసంక్షోభం, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలతో సతమతమవుతున్నది. మోదీ ప్రభుత్వం కాశ్మీర్‌లో 370 అధికరణాన్ని రద్దుచేయడాన్ని ఒక ఆయుధంగా ప్రజల దృష్టిని మళ్లించడానికి పాక్ సైన్యం ప్రయత్నిస్తున్నది. ప్రజల మద్దతున్న ఇమ్రాన్‌ఖాన్‌ను జైల్లో పెట్టింది.

బర్మా(మైన్మార్)లో మిలిటరీ నియంతృత్వంపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతున్నది. సాయుధ తిరుగుబాటు దళాలు సైన్యంతో ఘర్షణలు పడుతూ, అనేక ప్రాంతాల్లో ఆధిపత్యం సంపాదిస్తున్నది. వేలాదిమంది బర్మా సైనికులు పారిపోయి భారతదేశంలో తలదాచుకున్నారు. అఫ్గానిస్థాన్‌లో మతోన్మాద తాలిబన్లు నిరంకుశపాలన సాగిస్తూ, భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

నేపాల్‌లో ఓలీ ప్రభుత్వానికి భారత్‌తో సత్సంబంధాలు లేవు. ఆ ప్రభుత్వాన్ని బలపరుస్తున్న నేపాల్ కాంగ్రెస్ భారత్ పట్ల సానుకూలంగా ఉంటే, ప్రధాని శర్మ ఓలి చైనా అనుకూలుడని ప్రచారం జరుగుతున్నది. భారతదేశం భుజాలమీద తుపాకిపెట్టి అమెరికా చైనాకు వ్యతిరేకంగా మనలను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోంది. మారిషస్‌లో ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం, అక్కడి నుంచి భారత భద్రతా దళాలను వెళ్లిపొమ్మని అల్టిమేటం ఇచ్చాయి. చైనాతో సానుకూల సంబంధాలు పెట్టుకున్నది.

మన చుట్టూ ఉన్న దేశాలు మన కంటే, భౌగోళికంగా, సైనిక రీత్యా చిన్నవే. కాని చైనా చాలా బలవత్తరమైన దేశం. ఇరుగుపొరుగుతో మంచి సంబంధాలు మన విదేశాంగ విధాన ప్రధానసూత్రంగా ఉండాలి. చుట్టూ ఉన్న దేశాలలో రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు ఉన్నాయి. వారికి తగిన సహాయం చేయటం, వారి ఆంతరంగిక వ్యవహారాల నుంచి దూరంగా ఉండటం, ప్రస్తుతానికి విదేశాంగ నీతిగా ఉండాలి. ప్రతిపక్షాలను, మేధావులను విశ్వాసంలోకి తీసుకోవాలి. ప్రధానంగా ఎన్నికలలో గెలిచినంత మాత్రాన, ప్రజలను అణచివేసే నియంతృత్వ చట్టాలు, ధోరణులు కొనసాగితే ప్రజలు తిరుగుబాటు బాట పడతారని బంగ్లాదేశ్ ఆందోళన నుంచి గుణపాఠం మన పాలకులు నేర్చుకోవాలి.

'క్విట్ కార్పొరేట్' ప్రతిధ్వనించాలి

చలసాని వెంకటరామారావు

నరేంద్ర మోదీ అధికారంలో ఉంటే కార్పొరేట్లకు పండగే పండగ. గత పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం "చావుతప్పి కన్నులొట్ట పోయినట్లు"గా మిత్రపక్షాలతో కలిసి 2024 ఎన్నికల్లో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంది. పదేళ్ల బీజేపీ అసంబద్ధ పాలనను ప్రజలు తిరస్కరించినా తన పాత విధానాలనే తిరిగి కొనసాగిస్తున్నది. అందుకు 2024-25 కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక ప్రబల నిదర్శనం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌వర్గ ప్రయోజనాలకు పెద్దపీట వేసింది. విశాల దేశప్రయోజనాలను విస్మరించింది. బడ్జెట్ ప్రతిపాదనలలో మౌలిక రంగాలను నిర్లక్ష్యం చేశారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగానికి ఎటువంటి ఊతం లభించలేదు. సంపద ఉత్పత్తికి ప్రధాన కేంద్ర బిందువుగా ఉన్న కార్మికవర్గాన్ని విస్మరించారు. ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, మహిళా వ్యతిరేక, యువజన, విద్యార్థి వ్యతిరేక కార్పొరేట్ బడ్జెట్‌గా, ధనిక వర్గాల ఆశలకు అనుకూలమైన బడ్జెట్‌గా అనేకమంది ఆర్థికవేత్తలు ఈ బడ్జెట్‌ను పేర్కొన్నారు. "అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో" వండి వార్చిన బడ్జెట్ ఇది. కార్పొరేట్ల బడ్జెట్ నిరసిస్తూ ఈ నెల 9 న క్విట్ ఇండియా రోజున 'క్విట్ కార్పొరేట్' దినోత్సవాన్ని విజయవంతం చేయాలి.

రైతుల పట్ల ఈ బడ్జెట్ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ఎంతో కాలంగా రైతులు కోరుతున్న కనీస మద్దతు ధరకు ఎటువంటి హామీ ఇవ్వలేదు. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫారసులపై ప్రభుత్వం మౌనం పాటించింది. రైతాంగ ఉద్యమాలకు పాలకులు చలించిన దాఖలాలు బడ్జెట్‌లో కన్పించలేదు. బడ్జెట్ నుంచి బడ్జెట్‌కు వ్యవసాయరంగం కేటాయింపులు తగ్గించి వేస్తున్నారు. కేరళ తరహా రైతు విమోచన చట్టం తేవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నా ఎక్కడా దాని ప్రస్తావనలేదు. విత్తనచట్టం కావాలన్న రైతుల కోర్కెను పరిశీలించ లేదు. వ్యవసాయరంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ల దోపిడీకి వదిలివేశారు. రైతులు తీవ్ర ఆందోళన ఫలితంగా మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించినా పరోక్షంగా వాటిని అమలుచేసే విధానాలను కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్నది. కేంద్రప్రభుత్వం తెచ్చిన కొత్త విద్యుత్ బిల్లును

ఉపసంహరిస్తామని హామీఇచ్చినా ఆచరణలో దాటవేత వైఖరి అవలంబిస్తు న్నారు. వ్యవసాయరంగం కోట్లాది ప్రజలకు ఉపాధి కల్పిస్తుంటే రైతులకు బ్యాంకు రుణాలు సకాలంలో ఇవ్వటంలేదు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, డీజిల్, విద్యుత్ వంటి అంశాలలో రైతులకు సబ్సిడీలు ఎత్తివేస్తున్నారు. గత పదేళ్లుగా తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు రైతు రుణమాఫీ అమలుకు ప్రభుత్వం నిరాకరిస్తున్నది. కానీ బ్యాంకుల ద్వారా లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్లకు రాయితీలు, రుణాలు ఇస్తున్నది. కార్పొరేట్ల రుణాలకు ఎగనామంపెట్టే బ్యాంకులను దివాళా తీయిస్తుంటే ఆ భారం సైతం రైతులు, కార్మికులు, సామాన్యప్రజలు మోయవలసివస్తున్నది. ప్రకృతి వైపరీత్యాలకుగురై రైతులు పంట నష్టపోతే వారికి సరైన బీమా సౌకర్యం లేదు. రైతుల గోళ్లూడగొట్టి బ్యాంకులు రుణాలు వసూలు చేస్తున్నాయి. ఉచిత పంటల బీమా అన్ని పంటలకు గ్రామం, సర్వే నెంబర్లు ఆధారంగా ఇవ్వాలని రైతుసంఘాలు కోరుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. 60ఏళ్లు దాటిన రైతులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలనే రైతుల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆలోచించటంలేదు. ఈ స్థితిలో కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి వ్యవసాయరంగాన్ని రక్షించుకోవాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సర్వే ప్రకారం, దేశంలో పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు మాత్రమే అత్యధిక లాభాలు దండుకుంటున్నారు. నిరుద్యోగం, గ్రామీణ దారిద్ర్యం, ద్రవ్యోల్బణం ఆహార ద్రవ్యోల్బణం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఈ దశలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సామాజిక ప్రయోజనాలకు కేటాయింపులు ఎక్కువ చేయవలసి ఉంది. కానీ గత బడ్జెట్‌తో పోల్చితే సామాజిక రంగానికి కేటాయింపులు బాగా తగ్గించి వేశారు. నిరుద్యోగాన్ని పరిష్కరించే దశలో బడ్జెట్‌ను రూపొందించలేదు. ఉన్న ఉపాధిని కూడా కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ బడ్జెట్ ఫలితంగా సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయని ఈ ధోరణి మంచిది కాదని విశ్లేషకులు చెబుతున్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు కేటాయింపులు దేశ జీడీపీతో పోల్చితే తగిన విధంగాలేదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ బడ్జెట్ కార్పొరేట్లకు, ప్రజలకు మధ్య అంతరం బాగా పెంచి పోషించే విధంగా ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రజల జీవన వ్యయం పెరిగి, వేతనాలు పెరగక కొనుగోలుశక్తి మందగించిన స్థితిలో అసహాయ ప్రజలను ఆదుకునే పెన్షన్ వంటి పథకాలకు గతంలో 2023-24బడ్జెట్‌లో 9,652 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో సైతం అంతే మొత్తం కేటాయించారు. ఉచిత బియ్యం పంపిణీ పథకం (జాతీయ ఆహార భద్రతా చట్టం) కింద గతంలో 2లక్షల 12 వేల 332 కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం 2,05,250 కోట్లు మాత్రమే కేటాయించింది. కానీ ఆహార ద్రవ్యోల్బణం మాత్రం 9.4 శాతానికి పెరిగింది. అంటే ఉచిత బియ్యం పంపిణీ పథకానికి కత్తెర వేయనున్నారు. 3.33శాతం ఆహార సబ్సిడీ తగ్గిపోనుంది.

వ్యవసాయ ఎరువుల సబ్సిడీలను 13-18శాతం తగ్గించివేశారు. కార్మిక సంక్షేమ నిధిని 1200కోట్లు తగ్గించి వేశారు. మొత్తం మీద కార్మిక సంక్షేమశాఖ నిధులను 3000 కోట్లు ఈ బడ్జెట్‌లో తగ్గించివేశారు. గ్రామీణాభివృద్ధిశాఖ బడ్జెట్‌ను సైతం 20శాతం తగ్గించివేయటం బీజేపీ ప్రభుత్వ ప్రాధాన్యతను తెలియజేస్తుంది. వ్యవసాయరంగంలో కీలకమైన పంటల బీమా పథకానికి సైతం 1500కోట్లు కేటాయింపులు తగ్గించడం దినదినగండం, నూరేళ్ల ఆయుష్షు అన్నట్లు రైతుల పరిస్థితి దిగజారుతోంది. చివరకు రక్షిత మంచినీటి పథకానికి కూడా 1500కోట్లు తగ్గించారు. జాతీయ పట్టణాభివృద్ధి మిషన్ కేటాయింపులు 43శాతం కోత పెట్టారు. గత పదేళ్లుగా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రతి ఏడాది 2కోట్ల ఉద్యోగాల హామీని ప్రధాని నరేంద్ర మోదీ అటకెక్కించారు. ఈ రంగంలో తమ ఘోర వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఉద్యోగ కల్పనకు మూడు కొత్త స్కీంలు ఇప్పుడు ప్రకటించారు. చదువుకున్న నిరుద్యోగులకు సంప్రదాయక రంగం ద్వారా ఐదేళ్లలో ఐదుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రైవేటు రంగం ద్వారా ఉద్యోగాలు కల్పించేందుకు 15000కోట్లు ఉద్యోగ కల్పనా సబ్సిడీ క్రింద మూడు వాయిదాలలో ఇస్తారు. ప్రతి నెల రూ.3వేల చొప్పున ప్రావిడెంట్‌ఫండ్ కంట్రిబ్యూషన్ మొత్తం చెల్లిస్తామని ప్రకటించారు. ఒక పక్కన దేశంలో ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యంచేస్తూ ప్రైవేటు కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహిస్తూ పనిగంటలు పెంచి కార్మికులపై భారం మోపుతున్న స్థితిలో నూతన ఉద్యోగాల కల్పన ఎలా సాధ్యమో ప్రభుత్వమే చెప్పాలి. ఇప్పటికే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షలాదిగా యువతరం విదేశాలకు వలసలు పోతున్నారు. విదేశీ కంపెనీలకు ప్రత్యక్ష పన్నులలో మినహాయింపులు, దేశీయ పెట్టుబడి దారులకు పరోక్ష ప్రయోజనాలు కల్పిస్తూ ప్రైవేటురంగంలో ఉద్యోగాల కల్పన చేస్తామని చెబుతున్నారు. ఉద్యోగ కల్పన, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఉద్యోగాల సృష్టి దశాబ్దాలుగా ఎటువంటి మంచి ఫలితాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో బడ్జెట్ వివక్షతకు వ్యతిరేకంగా ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేయాలని ఆగస్టు 9 న క్విట్ ఇండియా దినోత్సవాన్ని "క్విట్ కార్పొరేట్" నినాదంతో ప్రతిధ్వనింపజేయాలని, సంయుక్త కిసాన్‌మోర్చా, ట్రేడ్ యూనియన్ల, స్వతంత్ర ఫెడరేషన్‌ల ఐక్యవేదిక పిలుపునిచ్చాయి. బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలని కోరాయి. దేశ సహజ సంపద, ప్రకృతి వనరులు, పంచ భూతాలపై హక్కు ప్రజలదేనని చాటిచెప్పాలి. కార్పొరేట్లకు అప్పనంగా బకాయిల రద్దుకు ఇచ్చిన 15 లక్షల కోట్ల రూపాయలను తిరిగి వసూలు చేసి రైతాంగం, కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని ఎలుగెత్తి చాటుదాం.

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
సెల్: 9490952093.

నిరుద్యోగం, ధరల ఊసెత్తని మోదీ సర్కార్

మీసా భారతి

న్యూఢిల్లీ: నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల గురించి మోదీ సర్కార్ మాట్లాడటం లేదని ఆర్జేడీ ఎంపీ మీసా భారతి ఆరోపించారు. వక్ఫ్ బిల్లుతో ఓ మతాన్ని లక్ష్యంగా చేయడం సరైంది కాదని అన్నారు. వక్ఫ్ బిల్లును విపక్ష ఇండియా పార్టీలు, ఆర్జేడీ తీవ్రంగా వ్యతిరేకిస్తాయని స్పష్టం చేశారు. కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లును జేఎంఎం ఎంపీ మహువ మాఝి వ్యతిరేకించారు. ఓ నిర్దిష్ట మతాన్ని లక్ష్యంగా చేసుకోరాదని ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రజలు విరాళంగా ఇచ్చిన భూములను తిరిగి తీసుకునేందుకు మీరెవరని ఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీ ప్రశ్నించారు. మొదటి నుంచి ప్రభుత్వ ఉద్దేశం ఇదేనని అన్నారు. బీజేపీ తన పేరును మార్చుకోవాలని అన్సారీ సూచించారు. లోక్‌సభలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వక్ఫ్ సవరణ బిల్లు 2024ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని విపక్షాలు విమర్శలు గుప్పించాయి.

బంగ్లా సరిహద్దులో తనిఖీలు ముమ్మరం

గువహతి: బంగ్లాదేశ్‌లో హింసాత్మక నిరసనలతో రాజకీయ సంక్షోభం నెలకొన్న క్రమంలో పొరుగు దేశంలో అలజడి ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించిందని అసోం సీఎం హిమంత విశ్వశర్మ తెలిపారు. అసోం సీఎం గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ దేశంలోకి ఏ ఒక్కరూ రాకుండా ఇండో-బంగ్లా సరిహద్దుల్లో పహారా ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వం అసోం ప్రభుత్వానికి సూచించిందని చెప్పారు. కేంద్రం సూచనలతో బంగ్లా సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేశామని, సరైన పాస్‌పోర్టులు, వీసాలు, దేశ పౌరులు మినహా ఎవరినీ మన దేశంలోకి అనుమతించడం లేదని తెలిపారు. బంగ్లాదేశ్‌లో అశాంతి నేపథ్యంలో ఆ దేశంలో ఉంటున్న హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, క్రైస్తవుల భద్రతను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, భారత ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని అసోం సీఎం వెల్లడించారు. బంగ్లాలో నివసించే భారతీయుల భద్రత పట్ల కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని చెప్పారు.

సిద్ధరామయ్య, డీకేకు కోర్టు సమన్లు

బెంగళూరు: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పదేపదే ప్రశ్నించడాన్ని నిరసిస్తూ రెండేళ్ల క్రితం జగిరిన నిరసన ప్రదర్శనలో పాల్గొనడానికి సంబంధించిన కేసులో ఆగస్టు 29న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తూ కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు బెంగళూరు కోర్టు గురువారం సమన్లు జారీచేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీని ఈడీ అనవరంగా వేధించడాన్ని వ్యతిరేకిస్తూ 2022 జూన్‌లో కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిరసన ప్రదర్శన నిర్వహించింది.

నిషేధాజ్ఞలు ధిక్కరిస్తూ సిద్ధరామయ్య, శివకుమార్ సహా పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు నిరసనలో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించి విల్సన్ గార్డెన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నిరసన శాంతి భద్రతలకు విఘాతం కల్పించిందని, అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా దీన్ని నిర్వహించారని పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే శివాజీనగర్ పోలీసు స్టేషన్‌లో కూడా నమోదైన ఇదే రకమైన కేసును కర్నాటక హైకోర్టు తరువాత కొట్టివేసింది.

రాజ్యసభ చైర్మన్ అలిగిన వేళ...

విపక్షాలకు దండం పెట్టి సభ నుంచి వాకౌట్

వినేశ్‌ను అవమానించినట్లేనన్న ధన్కర్

ఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడటం యావత్ భారతావనిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమెకు న్యాయం జరిగేలా చూడాలంటూ విపక్ష నేతలు కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే వినేశ్ అనర్హతకు దారితీసిన పరిస్థితులపై చర్చకు రాజ్యసభలో విపక్షాలు పట్టుబట్టాయి. ఇందుకు చైర్మన్ జగదీప్ ధన్కర్ నిరాకరించడంతో ప్రతిపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ పరిణామాలతో విపక్ష నేతల తీరుపై చైర్మన్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. 'వినేశ్‌పై అనర్హత పడినందుకు వారి హృదయం మాత్రమే ద్రవిస్తున్నట్లు మాట్లాడుతున్నారు. ఆ అమ్మాయి పరిస్థితి చూసి దేశం మొత్తం బాధపడుతోంది. కానీ, దీన్ని రాజకీయం చేస్తే అది ఆమెను అవమానపర్చినట్లే. ఆమె ప్రయాణం సుదీర్ఘంగా ఉంది' అని ధన్కర్ అన్నారు. అంతకుముందు సభలో కేంద్రమంత్రి జేపీ నడ్డా దీనిపై మాట్లాడారు. 'వినేశ్‌కు యావత్ దేశం అండగా ఉంది. ఆమె ఛాంపియన్లకే ఛాంపియన్ అని మోదీ నిన్న అన్నారు. 140 కోట్ల మంది భావన కూడా అదే. దురదృష్టవశాత్తూ ఈ అంశాన్ని సభలో మనం విపక్షం, అధికార పక్షం అన్నట్లు విభజిస్తున్నాం. ఆమె విషయంలో కేంద్రం, క్రీడాశాఖ, భారత ఒలింపిక్ మండలి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి' అని నడ్డా వివరించారు. మరోవైపు ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సుర్జేవాలా మాట్లాడుతూ... 'ఈ కష్ట సమయం నుంచి ఆమె కోలుకుని మళ్లీ బలంగా తిరిగొస్తుందని దేశమంతా విశ్వసిస్తోంది. కానీ కేంద్రం ఎందుకు దీనిపై మౌనంగా ఉంటోంది? చేజారిన ఆ పతకం వినేశ్ ఒక్కదానిదే కాదు. మన దేశానిది. దీనిపై భారత ఒలింపిక్ సంఘం... అంతర్జాతీయ ఒలింపిక్ సంఘంతో మాట్లాడాలి. ఆమెకు రజతం వచ్చేలా చూసే బాధ్యత కేంద్రానిదే' అని అన్నారు. ఈ సమయంలో రాజ్యసభ చైర్మన్, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. విపక్ష సభ్యులను ఓదార్చే క్రమంలో చైర్మన్ జగదీప్ కొంత అసహనానికి గురయ్యారు. ఆ సమయంలో ఆయన తన చైర్ నుంచి లేచి... సభ్యులకు దండం పెట్టి... సభ నుంచి వాకౌట్ అయ్యారు. సాధారణంగా విపక్షాలు వాకౌట్ చేస్తుంటే... చైర్‌లో కూర్చుండే చైర్మన్ ... వినూత్న రీతిలో విపక్ష సభ్యులపై తన ఆక్రోశాన్ని చూపించారు. కాంగ్రెస్ ఎంపీ జయరాం రమేశ్ నవ్వుతున్న తీరును ధన్కర్ తప్పుపట్టారు. చైర్ పట్ల గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నట్లు మండిపడ్డారు. తనను కాదు... చైర్‌పర్సన్ పోస్టును ఛాలెంజ్ చేస్తున్నారని, చైర్‌లో కూర్చున్న వ్యక్తి సమర్థుడు కాడన్న ఉద్దేశంతో విపక్ష సభ్యులు వ్యవహరిస్తున్నట్లు ధన్కర్ ఆరోపించారు. జైరాం రమేశ్ వైపు చూస్తూ ఇప్పుడు తనకు ఆప్షన్ లేదని, ఇవాళ జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే... ఇక్కడ కూర్చునే పరిస్థితిలో తాను లేనట్లు అనిపిస్తోందని జగదీప్ తెలిపారు. ఆ తర్వాత లేచి నిలబడ్డ ఆయన... చేతులు జోడించి దండం పెట్టి, సభ నుంచి వాకౌట్ చేశారు. మళ్లీ కాసేపయ్యాక వచ్చిన ధన్కర్... సభలో వాతావరణం ఆమోదయోగ్యంగా లేదన్నారు. తనకు తాను ఆత్మపరిశీలన చేసుకున్నానన్నారు. ఫొగాట్‌పై వేటు పడానికి కారణం ఏమిటో తెలియాలని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు.

6.5 శాతం వద్దే రెపోరేటు

ఆర్‌బీఐ కీలక నిర్ణయాలు

ముంబై: విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రేట్లను యథాతథంగా కొనసాగించింది. మంగళవారం ప్రారంభమైన పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. రెపోరేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు దీన్ని అలాగే కొనసాగిస్తూ వస్తోంది. ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది తొమ్మిదోసారి. దీనితోపాటు ఎంపీసీ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్కెట్ అంచనాలు, ఆర్‌బీఐ విధానాలకు మధ్య సయోధ్య కుదురుతోందని శక్తికాంత దాస్ వెల్లడించారు. ఏప్రిల్ - మేలో స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం... జూన్‌లో మళ్లీ పెరిగిందని, ఆహార పదార్థాల ధరలు పెరగడమే దీనికి కారణమని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరణ అసమతుల్యంగా ఉంది. కొన్ని కేంద్ర బ్యాంకులు ఇంకా కఠిన విధానాలు కొనసాగిస్తున్నాయి. పెరుగుతున్న అప్పులు, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు సవాల్‌గా మారాయి. భారత సేవా రంగ కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. బ్యాంకు రుణాల విస్తరణ నేపథ్యంలో ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడులు ఊపందుకుంటున్నాయి. బ్యాంకులు, కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్లు ఆరోగ్యకరంగా ఉన్నాయి. ప్రభుత్వం మూలధనం వ్యయాలపై దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో పెట్టుబడి అవకాశాలు ఆశాజనకంగా ఉన్నాయని ఆయన వివరించారు. 2024-25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం. ఒకటి, రెండు, నాలుగో త్రైమాసికంలో 7.2 శాతం, మూడో క్వార్టర్‌లో 7.3 శాతంగా ఉండే అవకాశం ఉందని, నైరుతి రుతుపవనాల వల్ల ఆహార ద్రవ్యోల్బణం దిగొస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 2024-25లో ద్రవ్యోల్బణం 4.5 శాతంగా అంచనా. రెండో త్రైమాసికంలో 4.4 శాతం, మూడో త్రైమాసికంలో 4.7 శాతం, నాలుగో త్రైమాసికంలో 4.3 శాతంగా ఉండే అవకాశం ఉందని, భారత కరెన్సీ రూపాయి మారకం విలువ పరిమిత శ్రేణిలోనే కదలాడుతోందని వెల్లడించారు. ఆగస్టు రెండు నాటికి భారత విదేశీ మారక నిల్వలు 675 బిలియన్ డాలర్ల వద్ద రికార్డు స్థాయికి చేరాయని చెప్పారు. రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో బ్యాంకుల డిపాజిట్లు తగ్గుతున్నాయని, దీంతో బ్యాంకులు క్రెడిట్ డిమాండ్‌ను అందుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. కుటుంబాల పొదుపులను ఆకర్షించడంపై బ్యాంకులు దృష్టి సారించాలని సూచించారు. వ్యక్తిగత రుణ వితరణలో గణనీయ వృద్ధి సాధించినట్లు తెలిపారు. దీన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక సంస్థలు కొన్నిసార్లు టాపప్ లోన్లు, బంగారు రుణాలు ఇవ్వడంలో నిబంధనలు పాటించడం లేదని, దీన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అరికట్టాలని స్పష్టంచేశారు. యూపీఐ పన్ను చెల్లింపు పరిమితి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచినట్లు,

నిరంతర చెక్ క్లియరింగ్‌ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. 2022-23లో జీడీపీలో 2 శాతంగా ఉన్న కరెంటు ఖాతా లోటు 2023-24 నాటికి 0.7 శాతానికి తగ్గిందని వివరించారు.

అఖిలేశ్...అమిత్‌షా మాటల యుద్ధం

న్యూఢిల్లీ: కేంద్రమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మధ్య గురువారం లోక్‌సభలో మాటల యుద్ధం నడిచింది. స్పీకర్ హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ అఖిలేశ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. 'లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హక్కులతో పాటు ప్రతిపక్ష ఎంపీల హక్కులను కాలరాస్తున్నారు. మీ (స్పీకర్) హక్కులను లాక్కొంటున్నారు. మీ తరఫున మేము పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం' అని అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన అమిత్ షా అఖిలేశ్ వ్యాఖ్యలను ఖండించారు. ఇది సభాపతిని అవమానించడమే అని ఎదురుదాడికి దిగారు.

స్పీకర్ హక్కులకు ప్రతిపక్షాలు పరిరక్షకులు కాదని ఆరోపించారు. 'సభలో అఖిలేశ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఇది స్పీకర్ పదవిని అవమానించడమే అవుతుంది. ప్రతిపక్ష ఎంపీలు స్పీకర్ హక్కుల పరిరక్షకులు కాదు. మీరు ఇలాంటి వ్యాఖ్యలు చేయకండి' అని అమిత్ షా అన్నారు. అనంతరం ఇదే అంశంపై స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదని అఖిలేశ్‌కు సూచించారు.

మోదీకీ షేక్ హసీనా గతే

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలు

భోపాల్: బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలడంతో... కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు ప్రధాని మోదీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజాగ్రహం షేక్ హసీనాను గద్దె దించిన మాదిరిగానే భారత్‌లోనూ ఏదో ఒక రోజు ప్రధాని నరేంద్ర మోదీ ఇంటిని ప్రజలు ముట్టడిస్తారని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నేత సజ్జన్‌సింగ్ వర్మ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బంగ్లాదేశ్‌లోని షేక్ హసీనా అధికారిక భవనాన్ని నిరసనకారులు ముట్టడించడంతో ఆమె దేశాన్ని వదిలి భారత్‌కి వచ్చిన విషయం తెలిసిందే. ఆమె భారత్‌కి వచ్చిన రెండ్రోజుల్లోనే కాంగ్రెస్ నేత ఈ వ్యాఖ్యలు చేయడం సంచలనం రేపింది. సజ్జన్ మాట్లాడుతూ... 'ప్రభుత్వ విధానాలు నచ్చక బంగ్లాదేశ్ తరహాలోనే మోదీ ఇంటిని ఏదో ఒక రోజు ప్రజలు ఆక్రమించుకుంటారు. ఇప్పటివరకు శ్రీలంక, బంగ్లాలో ఇలాంటి ఘటనలు జరగ్గా... త్వరలో భారత్‌లోనూ ఇదే పరిస్థితి రాబోతోంది' అని పేర్కొన్నారు. సజ్జన్ సింగ్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, బంగ్లాను విడిచిపెట్టిన షేక్ హసీనా కట్టుబట్టలతో భారత్‌కి వచ్చారు. ఆందోళనకారులు అధికారిక నివాసం దిశగా దూసుకొస్తుండటంతో ప్రధాని సహా ఆమె సహాయకులు దేశాన్ని విడిచిపెట్టి వచ్చారు. నిరసనకారులు సమీపిస్తుండటంతో కనీసం దుస్తులు, ఇతర వ్యక్తిగత వస్తువులు సైతం తెచ్చుకునే పరిస్థితి లేకపోయిందని హసీనా సన్నిహితులు వాపోయారు.

యూపీలో నిగూఢ హత్యలు

13 నెలల్లో 9 మంది మహిళలు హతం

పోలీసులకు తలనొప్పిగా మారిన వైనం

బరేలీ: ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ గ్రామీణ ప్రాంతాలను వరుస హత్యలు వణికిస్తున్నాయి. 13 నెలల్లో ఏకంగా 9 మంది మహిళలు ఒకే మాదిరిగా హత్యకు గురయ్యారు. వీరిలో ఎక్కువమందిని వారు కట్టుకున్న చీరతోనే గొంతుకు బిగించి చంపేశారు. హత్యకు గురైన మహిళలు అందరూ ఒకే వయసు గ్రూపు వారు కావడంతో ఈ వరుస హత్యలన్నీ ఒక సీరియల్ కిల్లర్ పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. చీరతో గొంతు బిగించి ప్రాణాలు తీస్తున్నాడని భావిస్తున్నారు. షాహీ, షీష్‌గఢ్, షెర్‌గఢ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత ఏడాది 40-65 ఏళ్ల మధ్య వయసున్న 8 మంది మహిళలు హత్యకు గురయ్యారు. అన్ని హత్యల ఘటనల్లోనూ మహిళల మృతదేహాలను చెరకు తోటల్లో దుస్తులు చిందరవందర అయిన స్థితిలో గుర్తించారు. అయితే లైంగిక దాడి జరిగిన ఆనవాళ్లు ఏ హత్యలోనూ కనిపించలేదు. గతేడాది జూన్‌లో వరుసగా మూడు హత్యలు, జులై, ఆగస్టు, అక్టోబర్ నెలల్లో ఒక్కొక్కటి చొప్పున, నవంబర్‌లో రెండు హత్యలు జరిగాయి. అయితే 8వ హత్య జరిగిన తర్వాత 300 మంది పోలీసులతో కూడిన అదనపు బలగాలు రంగంలోకి దిగాయి. యూనిఫారంతో కొందరు, సివిల్ దుస్తుల్లో కొందరు 14 బృందాలుగా విడిపోయి ఈ ప్రాంతాన్ని జల్లెడపట్టారు. పెట్రోలింగ్ నిర్వహించారు. పాత నేరస్థులపై నిఘా పెట్టారు. దీంతో కొంతకాలం హత్యలు జరగలేదు. గతేడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు ఒక్క హత్య కూడా జరగలేదు. దీంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ అసలు ట్విస్ట్ ఆగస్టులో జరిగింది. ఏడు నెలలపాటు ఎలాంటి హత్యా జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకుంటున్న వేళ జులైలో 9వ హత్య జరిగింది. అనిత అనే 45 ఏళ్ల మహిళ హత్యకు గురైంది. మునుపటి హత్యల మాదిరిగానే ఆమె మృతదేహాన్ని కూడా చెరకు తోటలోనే గుర్తించారు. షేర్‌ఘర్‌లోని భుజియా జాగీర్ గ్రామానికి చెందిన అనిత ఖిర్కా గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లింది. జులై 2న డబ్బు విత్‌డ్రా చేయడానికి ఇంటి నుంచి బ్యాంక్‌కు వెళ్లి తిరిగి రాలేదు. చెరకు తోటలో ఆమె మృతదేహం కనిపించింది. ఆమె చీరతోనే గొంతు నులిమి హత్య చేసినట్లు పోస్టుమార్టంలో నిర్ధారణ అయింది. దీంతో గతేడాది జరిగిన హత్యల వెనుక ఉన్న సీరియల్ కిల్లరే ఈ హత్య కూడా చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జులైలో జరిగిన హత్యను గమనించిన తర్వాత అనుమానాలు మరింత బలపడ్డాయని ఓ అధికారి చెప్పారు. ఇటీవల హత్య కేసు దర్యాప్తును ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అనుమానితుడి స్కెచ్ చిత్రాలను గురువారం విడుదల చేశారు. హత్యలు జరిగిన ప్రాంతాలకు చెందిన కొందరితో మాట్లాడిన తర్వాత ముగ్గురు అనుమానితుల స్కెచ్‌లను విడుదల చేశారు. ఏమైనా సమాచారం తెలిస్తే బరేలీలోని ఎస్పీ (సౌత్) కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

సీబీఐ వలలో ఈడీ అధికారి

ముంబై: అవినీతిని అంతమొందించే అధికారులే ముడుపులు తీసుకుంటున్న వైనం ముంబైలో బయటపడింది. ముంబైకు చెందిన నగల వ్యాపారి నుంచి రూ.20 లక్షల లంచం తీసుకుంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అసిస్టెంట్ డైరెక్టర్ ఒకరిని సీబీఐ గురువారం అరెస్టు చేసింది. ఆగస్టు 3, 4 తేదీలలో ఆ నగల వ్యాపారి ప్రాంగణాలలో ఈడీ సోదాలు నిర్వహించింది. తనకు రూ.25 లక్షల లంచం ఇవ్వకపోతే నగల వ్యాపారి కుమారుడిని అరెస్టు చేస్తానని ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్ సింగ్ యాదవ్ బెదిరించినట్లు సీబీఐ వెల్లడించింది. బేరసారాలు జరపగా రూ.20 లక్షలకు వారి మధ్య ఒప్పందం కుదిరిందని సీబీఐ అధికారులు తెలిపారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సీబీడీటీ) నుంచి ఈడీలో చేరిన యాదవ్‌ను లంచం తీసుకుంటుండగా ప్రత్యక్షంగా పట్టుకున్నట్లు అధికారులు చెప్పారు.

కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి సీబీఐ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 20 వరకు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఈ మేరకు గురువారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కస్టడీ గడువు ముగియడంతో సీబీఐ ఆయనను తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచారు. మద్యం పాలసీ కేసులో సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం కొట్టివేసిన విషయం తెలిసిందే. సరైన కారణం లేకుండా కేజ్రీవాల్ అరెస్టు జరిగిందని చెప్పలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌కు సంబంధించి ఈడీ వాయిదా కోరింది. కేజ్రీవాల్ బెయిల్ రద్దు చేస్తే మళ్లీ అరెస్టు చేస్తారా? అని హైకోర్టు ఈడీని ప్రశ్నించింది. కోర్టు ఈ కేసును సెప్టెంబర్ 5కి వాయిదా వేసింది. ఎక్సైజ్ పాలసీ కేసులో ఈడీ మార్చి 21న కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన తెలిసిందే. ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేంది. అయితే, ప్రస్తుతం సీబీఐ కేసులో తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో కేజ్రీవాల్ ఉన్నారు.

భారత్ వీడిన షేక్ హసీనా

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా బృందం భారత్‌ను వీడినట్లు తెలిసింది. ఆమె టీమ్ మొత్తం కొత్త గమ్యస్థానాలు వెతుక్కుంటూ వెళ్లిందని ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత ఏర్పడిన విషయం తెలిసిందే. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. ప్రజాగ్రహానికి భయపడి ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి తన సోదరి, ఇతర సన్నిహితులతో కలిసి భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం హసీనా సోదరులు సహా ఆమె బృందం మొత్తం ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌లో తాత్కాలిక ఆశ్రయం పొందుతున్నారు. అయితే, తాజాగా హసీనా బృందం భారత్‌ను వీడినట్లు సమాచారం. వారంతా తెలియని ప్రదేశానికి వెళ్లినట్లు ఆ కథనాలు వెల్లడిస్తున్నాయి. రాజీనామా అనంతరం హసీనా తన సోదరితో కలిసి సోమవారం సాయంత్రం భారత్ చేరుకున్నారు. ఆ తర్వాత భారత ప్రభుత్వ సహకారంతో హసీనా లండన్ వెళ్లాలని భావించారు. లండన్‌లో రాజకీయ శరణార్థిగా వెళ్లాలనుకున్నారు. అయితే, అందుకు ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హసీనాకు ఆశ్రయం కల్పించేందుకు బ్రిటన్ ఆసక్తిగా లేనట్లు తెలిసింది. దీంతో హసీనా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా దేశాలతో ఆశ్రయం కోసం షేక్ హసీనా సంప్రదింపులు జరిపారు. దీంతోపాటు తమ కుటుంబసభ్యులు నివసించే అమెరికా, ఫిన్‌ల్యాండ్ దేశాలతోనూ హసీనా టచ్‌లో ఉన్నట్లు తెలిసింది.

పోటా పోటీ యాత్రలు

ముంబై: మరికొన్ని నెలల్లో మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనుండగా శరద్ పవార్, అజిత్ పవార్ ఎన్నికల సమరానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్... శుక్రవారం నుంచి ఛత్రపతి శివాజీ జన్మించిన జున్నార్‌లోని శివనేరి ఫోర్ట్ నుంచి శివస్వరాజ్య యాత్ర ప్రారంభించనుండగా... నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్) అధినేత, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ సారథ్యంలో జన సన్మాన్ యాత్ర గురువారం నాసిక్ నుంచి ప్రారంభమైంది. సొంత సోదరులు శరద్ పవార్ 'ఆత్మ గౌరవానికి' ప్రతీకగా, అజిత్ పవార్ 'గౌరవానికి' సూచికంగా ఇలా వేర్వేరుగా ఒక రోజు తేడాతో యాత్రలకు శ్రీకారం చుట్టడంతో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. యాత్ర ఉద్దేశ్యాలతోపాటు విధి విధానాలను ఈ రెండు పార్టీలు విడుదల చేశాయి. రాష్ట్రంలోని ఎన్డీయే సారథ్యంలోని మహాయూత్ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రవేశ పెట్టిన పథకాల వల్ల జరిగిన అభివృద్ధిని ఈ యాత్ర ద్వారా అజిత్ పవార్ వర్గం వివరించనుండగా... మహారాష్ట్ర ప్రజల ఆత్మగౌరవమే అజెండాగా రాష్ట్రంలో సంప్రదాయ ఓటర్లను ఆకట్టుకునే విధంగా శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ తన యాత్రను ప్రజల్లోకి తీసుకు వెళ్లనుంది. ఎన్సీపీ (శరద్ పవార్) రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ మాట్లాడుతూ... మహారాష్ట్రలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం అవినీతితో ఏర్పడిందని విమర్శించారు. జయంత్ పాటిల్ వ్యాఖ్యలపై అజిత్ పవార్ సైతం స్పందించారు. వారు రాజకీయాలు చేస్తూనే ఉండాలన్నారు. తాము కేవలం అభివృద్ధికి మాత్రమే కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

అలాగే అజిత్ పవార్ పార్టీ అధికార ప్రతినిధి సంజయ్ రట్కారే మాట్లాడుతూ... తాము ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారని పేర్కొన్నారు. ఆ క్రమంలో తాము ప్రజల మధ్యకు వెళ్తున్నట్లు తెలిపారు. పశ్చిమ మహారాష్ట్రలోని మరఠ్వాడా ప్రాంతం నుంచి ఎన్సీపీ (శరద్ పవార్) యాత్ర ప్రారంభించి మొత్తం 31 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగనుంది. అలాగే ఉత్తర మహారాష్ట్రలోని అజిత్ పవార్ యాత్ర చేపట్టనున్నారు. విదర్భతోపాటు ముంబైని తన యాత్రతో చుట్టేయనున్నారు. అజిత్ పవార్ యాత్ర ఈ నెల 31తో ముగియనుంది.

ఉల్లిధరపై విపక్షాల భగ్గు

పార్లమెంటు వెలుపల ఆందోళన

న్యూఢిల్లీ: దేశంలో ఉల్లిధరలు భారీగా పెరిగాయి. ఉల్లితోపాటు ఇతర కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడింది. ధరలకు వ్యతిరేకంగా వివిధ పార్టీలకు చెందిన ప్రతిపక్ష ఎంపీలు గురువారం పార్లమెంటు వెలుపల నిరసన చేపట్టారు. ఉల్లిపాయల దండలు మెడలో వేసుకుని... కేంద్ర ప్రభుత్వం ఉల్లిధర తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝూ మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధరపై చట్టపరమైన హామీ ఇవ్వడం చాలా పెద్ద సమస్య. మరోవైపు పార్లమెంటులో క్రీడాకారుల(అథ్లెట్లు)పై చేసిన ఖర్చుల లెక్కలు చెప్పేటప్పుడు మాత్రం ప్రభుత్వం సిగ్గుపడదు. ప్రధానమంత్రి, క్యాబినెట్ మంత్రుల కోసం పన్ను చెల్లింపుదారుల డబ్బు ఎంత ఖర్చవుతుందో ప్రభుత్వం వివరించాలి' అని డిమాండ్ చేశారు. శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోదీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. వారి ఆదాయం సంగతి పక్కనబెడితే... వారు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మహారాష్ట్రలో ఉల్లి రైతులు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి అనుమతించకుండా...గుజరాత్ రైతులకు అనుమతిస్తారు. అందుకే మేము నిరసన తెలుపుతున్నాం' అని అన్నారు.

ఎంవీ రమణ ఆశయాలు అనుసరణీయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రమణ అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన సీపీఐ శ్రేణులు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: జీవితకాలం ప్రజల కోసం పనిచేయడమే కాకుండా మరణించిన తర్వాత కూడా పరోక్షంగా సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచనతో తాను మరణించిన తర్వాత భౌతిక దేహాన్ని మెడికల్ కళాశాలకు అందించాలన్న సీనియర్ కమ్యూనిస్టు నేత ఎంవీ రమణ ఆశయం చాలా గొప్పదని, ఆచరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఎంవీ రమణ భౌతిక దేహాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించడం జరిగింది. పార్టీ కార్యాలయం నుంచి సాగిన రమణ అంతిమ యాత్రలో సీపీఐ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచి మరణించేంతవరకు పార్టీ సిద్ధాంతాన్ని కట్టుబడి ప్రజల కోసం సేవ చేసిన వ్యక్తి రమణ అన్నారు. ఆయన అక్షయ, సిద్ధాంతాలను ముందుకు తీసుకొని పోయే విధంగా పనిచేయాలని కార్యకర్తలకు రామకృష్ణ పిలుపునిచ్చారు. తండ్రి కోరికను గౌరవించి ఎంవీ రమణ పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అందజేసిన ఆయన కుమారుడు వేణుగోపాల్, కోడలు సునీత మనో ధైర్యాన్ని అభినందిస్తున్నానన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు రమణ కుటుంబ సభ్యుల లకు, సీపీఐ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్, పి.రామచంద్రయ్య మాట్లాడుతూ... కామ్రేడ్ రమణ విద్యార్థి దశ నుండే కమ్యూనిస్టు పార్టీ ఆశయాలను అనుసరిస్తూ సమాజ సేవకు తన జీతాన్ని అంకితం చేశారన్నారు. రమణ బతికినంత వరకు విలువలతో కూడిన భారత కమ్యూనిస్టు పార్టీ ఆశయాలను పాటించడమే కాకుండా వాటిని కార్యకర్తలకు బోధించేవారన్నారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీకి సేవలందించారని రామచంద్రయ్య కొనియాడారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, అనంతపురం, సత్యసాయి జిల్లాల కార్యదర్శులు సి.జాఫర్, ఎం. వేమన్న యాదవ్, సీపీఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానందలు మాట్లాడారు, రమణ అంతిమ యాత్రలో కర్నూలు జిల్లా సీపీఐ నాయకులు భీమలింగప్ప, నద్యాల జిల్లా సీపీఐ కార్యదర్శి రంగా నాయుడు, నాయకులు నబీరసూలు, రాధాకృష్ణ, కడప జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర, కడప సీపీఐ నాయకులు రామయ్య, నాగ సుబ్బారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, అనంతపురం జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శులు పి. నారాయణస్వామి, మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ సంజీవప్ప, జె.రాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రమణయ్య, సి.లింగమయ్య, టి.రంగయ్య, ఎన్.శ్రీరాములు, బి గోవింద్, పి.రామకృష్ణ, గుంతపల్లి గోపాల్,బి.కేశవరెడ్డి, టి. కత్తి నారాయణస్వామి, వీరభద్రయ్యస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీశైలం రాజేష్ గౌడు, నాయకులు వి.కె.కృష్ణుడు, ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శి ఆనంద్, సంతోష్, రైతు సంఘం నాయకులు బండి రామకృష్ణ, మహిళా సమాఖ్య నాయకురాలు ఆర్. అమీనా, వరలక్ష్మి, పద్మావతి, పార్వతీ ప్రసాదు, రాజీవ్ కాలనీ సర్పంచ్ డి. ఆశాబీ, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు వి.కె రంగారెడ్డి, పతకమూరి నాగరాజు, ఎం.ఖామర బేగం, లెక్చరర్ చెన్నకేశవులు, శ్రీనివాసులు, ఓబుళేసు, గాయకుడు లెనిన్‌బాబు, అంకన్న , గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాప్తాడు, శింగనమల, గుత్తి నియోజకవర్గాల నుండి సీపీఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కామ్రేడ్ ఎం.వి రమణ కు నివాళు లర్పించనవారిలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం అహ్మద్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎ.పి లైటింగ్ కుళ్లాయప్ప, చంద్రశేఖర్, అబ్దుల్ రసూల్, సీపీఐ మాజీ నాయకులు దస్తగిరి, బి.శంకర్, బి.రుషేంద్రబాబు, శకుంతలమ్మ, వై.సూర్యనారాయణ రెడ్డి , నీలూరు లక్ష్మయ్య, నరసింహులు, జర్నలిస్టు నాయకులు టి.రామాంజనేయులు, ఆర్.రామాంజనేయులు, కూడేరు రవిచంద్ర, కె.పి కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు సాకేహరి, శింగనమల బీజేపీ నాయకులు రవిరాజ్, దళిత నాయకులు దాసరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా సీపీఐ కార్యాలయంలో ఎం.వి రమణ భౌతిక కాయానికి టీడీపీ రాష్ట్ర నాయకులు గంగారామ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీ నరసింహులు తదితరులు నివాళు లర్పించారు. సీపీఐ సీనియర్ నాయకులు మాలపాటి వెంకట రమణ మృతి అనంతపురం జిల్లాకు తీరని లోటు అని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రమణ ఇంటికి వెళ్లి.. ఆయన భౌతిక దేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

చంద్రబాబుకు విలువలు లేవు: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబుకు న్యాయం, ధర్మం రెండూ లేవని, తన స్వార్థం కోసం ఏదైనా చెబుతాడంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాల ఎంపీటీసీ, జడ్పీటీసీలతో గురువారం జగన్ సమావేశమయ్యారు. జగన్ మాట్లాడుతూ, సీఎంగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ఆ వ్యక్తికి ధర్మం, న్యాయం అనే పదాలకు అర్థం తెలిసి ఉండాలన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి ముఖ్యమంత్రి అయ్యాడని అన్నారు. కష్టకాలంలో మనం ఎలా ఉంటున్నామనేది ప్రజలు చూస్తారని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

అమూల్ పాల సేకరణపై నిజాలేంటి?

మంత్రి అచ్చెన్నాయుడుకు ఏపీ రైతు సంఘం లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో అమూల్ సంస్థ ద్వారా మహిళా పాల సొసైటీలు, సేకరణ కేంద్రాల నుండి పాల సేకరణ నిలుపుదల చేయమని ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంపై మహిళల ఆందోళన చెందుతున్నారని, దీనిపై తక్షణం జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు, ఏపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎం నాయక్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ గురువారం లేఖలు రాశారు. గత ప్రభుత్వ హయాంలో గుజరాత్‌కు చెందిన అమూల్ సంస్థతో ఒప్పందం చేసుకొని 19 జిల్లాల్లో మహిళా పాల సొసైటీలు, సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి పాల సేకరణ చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుండి అనంతపురం జిల్లాలోనూ, 21 నుండి చిత్తూరు జిల్లాలో ప్రస్తుత ప్రభుత్వం కల్పిస్తున్న సమస్యల వల్ల పాల సేకరణ నిలుపుదల చేస్తున్నట్లు అమూల్ యాజమాన్యం క్షేత్రస్థాయి మహిళా సొసైటీలకు, సేకరణ కేంద్రాలకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. దీంతో మనోవేదనకు గురైన మహిళలు తమకు ముందస్తుగా ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా పాల సేకరణ నిలుపుదల చేస్తున్నట్లు అమూల్ సంస్థ ఆదేశాలివ్వడం సరైందికాదని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంతో సమస్యలు ఉంటే చర్చించి పరిష్కరించుకోవాల్సిన అమూల్ సంస్థ యాజమాన్యం అర్ధాంతరంగా సేకరణ నిలుపుదల చేయడం సరైందికాదన్నారు. దీనిపై జోక్యం చేసుకొని పాలసేకరణ నిలుపుదలకు సంబంధించిన ప్రచారంలో నిజానిజాలు సమీక్షించి... పాల సేకరణ కొనసాగించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

వయనాడ్ బాధితులకు అండగా నిలుద్దాం

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి

విశాలాంధ్ర-విజయవాడ: వయనాడ్ వరద బాధితులను కాపాడుకుందామని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వరదల కారణంగా వయనాడ్ ప్రాంతంలో బీభత్సం జరిగిందని, భారీగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, కొంతమంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదని తెలిపారు. బాధితుల జీవితాలు దుర్భరమయ్యాయని, వారిని ఆదుకోవడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. అందులో భాగంగా బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని ఇప్టా జాతీయ నాయకత్వం పిలుపు నిచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో సాధ్యమైన మేరకు అన్ని జిల్లాల్లో బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్నామన్నారు. వర్తక, వాణిజ్య సంస్థలు, వ్యక్తుల నుండి విరాళాలు సేకరించి రాష్ట్ర కేంద్రానికి పంపించాలని కోరారు. ఆగస్టు 15వ తేదీ నాటికి ఆయా జిల్లాల్లో సేకరించిన మొత్తాన్ని రాష్ట్ర కేంద్రానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీకి కందిపప్పు సరఫరా

ఢిల్లీలో కేంద్ర మంత్రికి నాదెండ్ల విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/ఢిల్లీ: రాష్ట్రానికి కందిపప్పు సరఫరా చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర వినియోగదారులు, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని కలిసి వివిధ సమస్యలను వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న ఎన్ఎఫ్ఎస్ఏ పరిధి కాకుండా లబ్ధిదారుల పరిధిని మరింత పెంచాలని కోరారు. మరో ఎనిమిది కేంద్రాల పెంపునకు అనుమతివ్వాలని, ధరల స్థిరీకరణకు రూ.532 కోట్ల నిధులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.1,187 కోట్ల పెండింగ్ నిధులను వీలైనంత త్వరగా విడుదల చేయాలని, 11 సీలో గోడౌన్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో నాదెండ్ల మాట్లాడుతూ, ఆయా అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని, పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఈ అంశాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి రేషన్ కార్డుల విషయంలో కేంద్రం అనుసరించే ఎన్ఎఫ్ఎస్ఏ ప్రకారం రాష్ట్రానికి చాలా అన్యాయం జరిగిందన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా, 2001 సెన్సెస్ ప్రకారం కేటాయించారని వివరించారు. దీంతో రేషన్ కార్డులు బాగా తగ్గిపోయాయన్నారు. ప్రస్తుతం 1.47 కోట్ల కుటుంబాలకు ఎలాంటి ఆటంకం లేకుండా రేషన్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. గిడ్డంగుల నిర్మాణానికి సహకారం అందించాలని కోరినట్టు మనోహర్ వెల్లడించారు.

అవయవదాతలను గౌరవిద్దాం

వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మార్గదర్శకాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బ్రెయిన్ డెడ్‌తో మరణించినా... అవయవదానంతో కొందరికి జీవనదాతలుగా నిలిచిన వారి పార్థివ దేహాలకు గౌరవప్రదమైన వీడ్కోలు తెలపాలని, ఆయా కుటుంబాలకు రూ.10 వేల పారితోషికాన్ని అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను వివరిస్తూ వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అవయవదాతల అంత్యక్రియలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయా జిల్లాల్లో కలెక్టర్ లేదా ఎస్పీ హాజరయ్యేలా ఆదేశాలిస్తామని ఇటీవల మంత్రి సత్యకుమార్ ప్రకటించగా, ఆయన చొరవతో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అవయవదానంతో కొందరికి జీవన దానం చేసిన జీవదాతల భౌతిక కాయాలకు గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక్కొక్కరికీ రు.10 వేల వంతున పారితోషికాన్ని మంజూరు చేసిందని, దీనితో పాటు అవయవ దాతల కుటుంబ సభ్యుల్ని గౌరవిస్తూ వారిని సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఉత్తర్వులో పేర్కొన్నారు. మార్గదర్శకాలను అనుసరించాలని అధికారులకు సూచించారు. బ్రెయిన్ డెడ్ వ్యక్తి దేహం నుంచి అవయవాలను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి లేదా సంబంధిత (ప్రైవేటు) ఆస్పత్రి ప్రధానాధికారి ద్వారా సేకరించిన తరువాత సంబంధిత కలెక్టర్ వారి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందచేయాలని, పార్థివ దేహానికి రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలను నిర్వహించాలని సూచించారు.

విత్తనాల సరఫరాలో ప్రభుత్వ వైఫల్యం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంలో కూటమి సర్కార్ విఫలమైందని, రైతుల ఆశలను పూర్తిగా అవిరి చేసిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌వేదికగా ఆమె ట్వీట్ చేశారు. సాగర్ కుడికాలువ ఆయకట్టు కింద సాగునీరు వచ్చిందని సంతోష పడేలోపే, వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం నాలుగు లక్షల మంది రైతుల పాలిట శాపంలా మారిందన్నారు. క్రాప్ హాలిడే నుంచి బీడు భూములను సాగులోకి తెద్దామనే రైతు ఆశను మళ్లీ చంపుతున్నారని, పోలీసులను కాపలా పెట్టి టోకెన్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు అడిగింది కాకుండా సర్కారుకు నచ్చిన విత్తన రకం కొనాలని ఒత్తిడి చేయడాన్ని ఆమె తప్పుపట్టారు. మహిళలు అని చూడకుండా విత్తనాల కోసం వర్షంలో నిలబెడతారా అని ప్రశ్నించారు. తొక్కిసలాట జరుగుతుంటే చోద్యం చూస్తారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. 48 గంటల్లోగా రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

ఆశలు ఫలించేనా?

నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్ మాధ్యమం, జోనల్‌కు దరఖాస్తులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో 1:100 చొప్పున అభ్యర్థులను ఎంపిక చేయాలనే వినతులు ప్రభుత్వానికి అందుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇదే తరహాగా వినతులు అందజేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ గ్రూప్-1 అంశం తెరపైకి వస్తోంది. ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల సమయం దగ్గరపడుతుండంతో అభ్యర్థుల్లో ఆందోళన మొదలవుతోంది. ఇప్పటికే గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులంతా... మెయిన్స్ పరీక్షలో రాయబోయే మాధ్యమం, జోనల్ ఎంపికలు, పోస్టుల రకం తదితర వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కమిషన్ వెల్లడించింది. గత ప్రభుత్వ హయాంలో మొత్తం 81 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మెయిన్స్ పరీక్షలు సెప్టెంబరు రెండో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహిస్తామని ఇప్పటికే ఏపీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 17న రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల్లో 301 పరీక్ష కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా, కేవలం 24 రోజుల్లోనే అంటే ఏప్రిల్ 12వ తేదీన ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 1,48,881 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, వారిలో 1,26,068 మంది హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో 91,463 మంది పరీక్ష రాశారు. ఫలితాల్లో 1:50 చొప్పున 4,496 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. దీంతో 1:50 కాకుండా, 1:100 విధానంతో ఎంపిక చేయాలని అభ్యర్థులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇప్పటికే నిరుద్యోగ, యువజన సంఘాలు ఏపీపీఎస్సీ, ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు ప్రకటించిన డీవైఈఓ, గ్రూప్-2 మెయిన్ పరీక్షలకు ప్రిలిమ్స్ నుంచి 1:100 నిష్పత్తిలోనే ఎంపిక చేశారని, అదే తరహాగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకూ 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలని గుర్తుచేస్తున్నారు. దీనిపై గత ప్రభుత్వాన్ని కోరినా ఫలితం దక్కలేదనీ, కొత్త ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అటు సెప్టెంబరులోనే గ్రూప్-1 మెయిన్ పరీక్షలు జరగనున్నాయి. ఈ సమయంలో ప్రభుత్వం ఒకవేళ సానుకూలం స్పందించి మెయిన్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో ఫలితాలను ప్రకటిస్తే.. పరీక్ష సన్నద్ధతకు సమయం కావాలంటూ అభ్యర్థులు కోరతారు. దీంతో మెయిన్ పరీక్షలు వాయిదా పడే అవకాశముంది. అదే జరిగితే ఇప్పట్లో ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్ పరీక్షలు ఉండవు. దీనిని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల కోరిక మేరకు మెయిన్స్ ఎంపికను 1:100 చొప్పున ఉంటుందా... 1:50తోనే సరిపెడతారా అనే దానిపై ఏపీపీఎస్సీ నిర్ణయమే కీలకం కానుంది.

16లోగా వివరాల నమోదు: ఏపీపీఎస్సీ

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు తాత్కాలికంగా అర్హత పొందిన అభ్యర్థులంతా పరీక్షలు రాసే మాధ్యం, పోస్టులు, జోనల్ ప్రాధాన్యతలు, పరీక్షా కేంద్రాలను ఈనెల తొమ్మిదో తేదీ నుంచి 16వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తులో నమోదు చేసుకోవాలని ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అర్హత పొందిన వారంతా పీఎస్సీ.ఏపీ.గౌవ్.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల ప్రాధాన్యతలను స్థిరంగా నమోదు చేసుకోకుంటే, తమ వద్ద ఉన్న వివరాల ప్రకారం పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు.

రైతులకు కొరత లేకుండా విత్తనాలు

ఈ-క్రాప్... డ్రోన్ల వినియోగం పెంపు

వ్యవసాయశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో రైతులకు ఎక్కడా విత్తనాలు కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జూలైలో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు తిరిగి పంటలు వేసుకునేందుకు వీలుగా రూ.36 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కింద విడుదల చేయాలని, వందశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని సూచించారు. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి రైతుకు నికర ఆదాయం పెరిగేలా వ్యవసాయంలో తగిన మార్పులు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం వ్యవసాయ అనుబంధ రంగాలపై సీఎం సమీక్షించారు. వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యవసాయ శాఖ కార్యక్రమాలు, పథకాలు, ఆ రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై సీఎంకు వివరించారు. సీఎం మాట్లాడుతూ వ్యవసాయంలో ఉత్పత్తిని పెంపొదించడంతో పాటు రైతుకు నికర ఆదాయాన్ని పెంచేలా సాంకేతికతను వినియోగించాలన్నారు. ఉత్తమ విధానాల ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడంతోపాటు నికరాదాయాన్ని పెంచే రీతిలో సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. పంట పొలాల్లో పురుగు మందులు పిచికారికి డ్రోన్‌ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. కేంద్ర పౌర విమానయాన శాఖతో మాట్లాడి రాష్ట్రంలో డ్రోన్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేద్దామని చెప్పారు. ఉద్యాన పంటల్లో దేశంలోనే రాష్ట్రం ముందుండేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో అరటి, మామిడి, నిమ్మ, ఆయిల్ ఫామ్, కొబ్బరి, కాఫీ, టమోటా వంటి పంటల సాగులో దేశంలో మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నామని వివరించారు. ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి అవసరమైన మౌలిక సదుపాయల కల్పన, మార్కెటింగ్, లాజిస్టిక్ సౌకర్యాలు, కోల్డ్ స్టోరేజీలు, తక్కువ ఖర్చుతో రవాణా వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

2024-25లో లక్ష ఎకరాలను సూక్ష్మ సేద్యం కింద అదనంగా సాగులోకి తేవాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం సహకార శాఖపై సమీక్ష జరగ్గా ఆ శాఖ కమిషనర్ ఎ.బాబు వివరిస్తూ ప్రసుతం రాష్ట్రంలో 13 డీసీసీబీలు ఉన్నాయని, ప్రతి జిల్లాకు ఒక డీసీసీబీని ఏర్పాటు చేయాల్సి ఉందని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ప్రస్తుతం 24 పెట్రోల్ అవుట్ లెట్లు నిర్వహిస్తుండగా ఆయిల్ కంపెనీల నుంచి మరో 64 ఎన్‌ఓసిలు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

కృష్ణాజలాల సమస్య పరిష్కరించాలి

ముఖ్యమంత్రికి లక్ష్మీనారాయణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణా జలాలపై బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు కల్పించిన హక్కుల పరిరక్షణ జీవన్మరణ సమస్యగా పరిణమించిందని, దీనిపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక నాయకులు టి.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం ఆయన లేఖ రాశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో ఈనెల 28, 29 తేదీలలో విచారణకు రానున్న కృష్ణానదీ జలాల అంశంపై మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావుతో పాటు రైతుసంఘాల నేతలు కేవీవీ ప్రసాద్, అక్కినేని భవానీప్రసాద్, వై.కేశవరావు, బొజ్జా దశరథరామిరెడ్డి, ఆళ్ల వెంకట గోపాలకృష్ణతో కూడిన ప్రతినిధి బృందం సీఎంకు వినతిపత్రం అందజేయాలని అనుమతి కోసం జులై 30వ తేదీన అపాయింట్‌మెంట్ వ్యవహారాలు చూసే అధికారికి వాట్సాప్ ద్వారా విజ్ఞప్తి చేస్తూ సమాచారం అందించామని గుర్తుచేశారు. ఫోన్ ద్వారానూ ప్రయత్నించామని పేర్కొన్నారు. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి తెలంగాణ లేవనెత్తిన వివాదంపై ఆంధ్రప్రదేశ్ వైఖరి తెలియజేయడానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన గడువు మరో వారం రోజుల్లో ముగియనుందని, జలవనరుల శాఖకు సంబంధించిన అంశాలపై ఈనెల 6న సమీక్ష చేసినట్లు దినపత్రికల్లో చదివానని, ఈ సమస్య ప్రస్తావన వార్తల్లో ఎక్కడా కనపడలేదని తెలిపారు. రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలను సీఎం దృష్టికి తీసుకురావాలన్న సదుద్దేశంతో అనుమతి కోసం తాను చొరవ తీసుకొని ప్రయత్నించానని పేర్కొన్నారు. ఇప్పటివరకు అనుమతి లభించలేదని, ఈ క్రమంలో క్లిష్టంగా పరిణమించిన కృష్ణా నదీ జలాల సమస్యపై తనకు గల అవగాహనను సీఎం దృష్టికి తీసుకురావడం ఆంధ్రప్రదేశ్ పౌరుడుగా తన బాధ్యతని తెలిపారు. ఈ వినతిపత్రాన్ని ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా పంపానని, తప్పక పరిశీలించాలని కోరారు.

సీమ సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి

మంత్రులకు రాయలసీమ సాగునీటి సాధన సమితి విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్6న తీసుకొని వచ్చిన చీకటి జీవో అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. గురువారం ఆయన జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డితో కలిసి జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రహదారుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి లతో భేటీ అయ్యారు. వరదలతో శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజి నిండటంతో రైతాంగంలో ఆనందం నెలకొందని బొజ్జా ఈ సందర్భంగా మంత్రులకు తెలిపారు. కృష్ణానది పరవళ్లు తొక్కుతున్నప్పటికీ ఈ నీటిని రాయలసీమలో ప్రాజెక్టులకు మళ్లించడంలో అనేక అడ్డంకులున్న విషయాన్ని ప్రాజెక్టుల వారిగా మంత్రులకు బొజ్జా వివరించారు. వీటిని సవరించి కృష్ణా నీటిని రాయలసీమ ప్రాజెక్టులకు మళ్లించడానికి కావలసిన నిర్మాణాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రులను కోరారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి అంశాలపై విశ్లేషణాత్మకంగా రాసిన "నీటి అవగాహనే రాయలసీమకు రక్ష" పుస్తకాన్ని మంత్రి నిమ్మలకు బొజ్జా అందజేశారు. బొజ్జా వివరించిన సాగునీటి అంశాలపై మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాలపై సీఎం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, ఆ విధంగా కార్యాచరణ చేపడతామని హామీ ఇచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.